


సంపుటః ౮. విక్రమ, మార్గశిరము : డిశంబరు, 1940. సంచిక : 3.

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి

చైత్రపల్లవదూతి చక్కిలిగింతలఁ
గుస్తరింపగబాడు కోకిలంబు,
జలకమాడిన నభోజనని ఘనాలక
లాఱవిప్పినవేళ నాడు నెమిలి,
పండువెన్నెల జున్నుబాలు చేపిన రేల
'స్వరజతుల్' వల్లించు భ్రమరబాల,
దానిమ్మ పగడాలకానుపు గనునప్డు
నామకీర్తన సల్పు రామచిలుక
ప్రాణిలోకము, రసవదిష్టార్థరక్తి
నవశమగునప్డె యున్మత్త యగును కవిత;
రచనలేక, రాగములేక, రసములేక
ఈ జగద్యాత్ర శోభిల్లునే? సుధీంద్ర!

కావ్యసౌభాగ్యరేఖలను మీమాంసించి
తెఱవని వాకిండ్లు తెఱచినావు,
ఆంగ్లభాషీయవాహన మధిరోహించి
గిలకొట్టి కదను త్రొక్కించినావు,
కఱకుమెత్తదనాలు కలిసి పైకొన పాద
వేదికాగ్రముల గప్పించినావు,
అతి నవీనుడవయ్యు అనుగుతల్లి తెనుంగు
నుడికారపుం జవిఁ మురిసినావు,
ఉత్తమాధ్యాపకుడ వంచు నొప్పినావు,
విశ్వవిద్యాలయము మోసి వెలసినావు,
సహృదయస్వామివై కళల్ సాకినావు,
కట్టమంచిరసాలశాఖాఫలంబ!

మత్స్యగంధి సమీపమందు ముగ్ధుండయ్యె
ధీరవచస్వి భట్టారకుండు,
సంజయవాక్యార్థ చాలనఁ బొడకట్టె
చోద్యచోదకభాషి సోమయాజి,
రెడ్డిరాజుల చూఱుకోత వీధులనోచె
నవరసమూర్తి శ్రీనాథసుకవి,
శాలీను ముఖమున సాక్షాత్కరించె, న
వ్యక్రాంతదర్శి సూరన్నప్రోడ,
లక్ష్యలక్షణరూపకల్పనలయందు
ద్యోతమగు నుదాత్తుల సంప్రయోగరేఖ
అట్లె బింబించెదవు భవదాత్మ సురభి
ళామృతవచోముకురమందు రామలింగ!

—రాయప్రోలు సుబ్బారావు.

సుబ్బరామయ్య కాలువ

[నిజంగా జరిగిన కథ]

'ఇంక కాలువాను నేను ముట్టడంలేదు. గంగాభవాని కర్పణంచేశాను. నన్ను మన్నించవలసింది.' అని దండముపెట్టి చెంపలు కొట్టుకున్నాడు.

రచయిత :

పురాణం పిచ్చయ్యశాస్త్రి

ఇది కథగాదు.

ఇంచుమించుగా నలభై యేండ్లకు ముందు జరిగినవిషయము.

నేను నెల్లూరులో చదువుకొనుచుంటిని. అప్పటి దినాలలో బ్రాహ్మణులకు హోటళ్లు యెక్కువ లేవు. ఏవో రెండుమూడు మాత్రమే యుండినవి. వానిలో వెంకట్రామయ్యగారి హోటలు ఒకటి. వెంకట్రామయ్య హోటలంటే కొంచెము మంచిపేరు. శుచిగాను, రుచిగాను, ఉండడంచేతను, వచ్చినవారిని మరియాదతో చూడడంచేతను, భోజనమున కాయనయింటికే యెక్కువగా వచ్చేవారు. ఏ యంతరాయాలు లేక వ్యాపారం సాగిపోతూవుంది.

ఆ మహాపురుషునికిగల సద్గుణముల్లో రెండు ముఖ్యమైనవి: ఎప్పుడున్నూ తాంబూలం నములుతూవుండడ మొకటి. పేకాట రెండవది. మధ్యాహ్నం భోజనాలైన తరువాతనున్నూ, రాత్రి భోజనములైనతరువాతనున్నూ వేంకట్రామయ్య పేకాట అనే యానందసముద్రంలో మునిగియుండేవాడు. భోజనానికి వచ్చేవారిలోనున్నూ కొందరు చేరుచుండేవారు. ఈ వ్యాపారమునకు వచ్చేవారందఱును, ఏ పనిన్ని లేక తిరుగుచుండే మహానుభావులు. వేంకట్రామయ్యగారికి వారు పేకాట కైంకర్యములో తోడుపడి ఆయనను ధన్యునిజేస్తూ తాము ధన్యులై జీవయాత్ర గడుపుచుండేవారు. ఏయభ్యంతరమున్నూ లేక రాత్రుళ్లు పగళ్లు ఒకేరీతిగా యాటసాగుతూవుండడంవల్ల వేంకటరామయ్యకు తీరుబడియే కలిగేదికాదు. అయినను ఆయన యేనాడుగాని యొక యణాయైనను గెలిచినాడని యూరిలో చెప్పినవారుగాని, వినినవారుగాని యెవ్వరును లేరు. ఆనాటికానాడు పూటకూలివర్తకంలో సంపాదించిన డబ్బు కొంతకర్చు భోజనసామగ్రికి పోగా మిగిలింది చీట్లాటలో పోగొట్టుకొంటూవుండడంచేత యాయన గడించినడబ్బు సార్థకవినియోగంక్రింద అయిపోతూవుండేది.

ఈలాగా జరుగుచుండగా సుబ్బరామయ్యయనే పేరుగల వెలనాటి బ్రాహ్మణు డొకాయన (రక్తసంబంధముగల బంధువులెవ్వరును లేనివాడు) తనకుండిన సొత్తులమ్ముకొని రెండువేలు డబ్బు మూటగట్టుకొని రామేశ్వరంపోతూ నెల్లూరులో రైలుబండి యెక్కిపోవలెననే తలంపుతోవచ్చి పేరుగాంచిన వేంకటరామయ్య హోటలులో ప్రవేశించాడు. ఆదినాల్లో రైలు నెల్లూరువరకే యుండినది, అదిన్ని చిన్నబండి. అందువల్లనే సుబ్బయ్య నెల్లూరుకువచ్చి రైలు యెక్కిపోవలెననుకొన్నాడు. కాని ఆయన యత్నము కొనసాగలేదు. హోటలులో చేరినంతట, తాను వంగోలుతాలూకాలో యేదో గ్రామంవాడననిన్ని, రామేశ్వరం పోవడమునకై యీదారిని వచ్చినాననిన్ని

చెప్పి నాలుగుదినాలు నెల్లూరులో నిలిచి తరువాత పోనెంచి, తన యభిప్రాయం- వేంకటరామయ్యతో చెప్పగా ఆయనకుబసకు గదిచూపి, కావలసిన యేర్పాటులను చేయించినాడు. సుబ్బరామయ్య పదిహేను రోజు లక్కడనే గడపుచుండెను.

ఈకాలంలో, వేంకటరామయ్య సుబ్బరామయ్యగార్ల నా నాటికి స్నేహ మెక్కుడైనది. దీనికి ముఖ్యమైన కారణమేమంటే వెంకటరామయ్యవలెనే సుబ్బరామయ్యయు పేకాటలో నెక్కుడైన భక్తిశ్రద్ధలుగలవా డగుటయే! అందువల్ల సుబ్బరామయ్య రామేశ్వరయాత్ర మాటనే మరచిపోయెను. నెలకు పది రూపాయలు యిచ్చేలాగున్నూ, తనకు కావలసిన సౌకర్యములన్ని జరిగిస్తూవుండవలసినదనిన్ని చెప్పి యేర్పాటుచేసుకొని ఆపుణ్యాత్ము డక్కడనే స్థిరవాస మేర్పఱచుకొనెను. తనదగ్గఱఉండిన డబ్బుగిబ్బు వేంకటరామయ్యచేత యిచ్చి కావలసినపు డడిగితీసుకుంటూ వుండెను. రెండువేల రూపాయలు చేతజిక్కినందున ఆటకుగాని యితర కార్యాలకుగాని యేమిన్ని తక్కువలేకుండా జరుగుతూవచ్చెను. వేంకటరామయ్య అదృష్టమోయన్నట్లు నాలుగైదు నెలలు జరిగినంతట ఉన్నట్లుండి సుబ్బరామయ్యకేదో జబ్బు కనిపించి యది యెక్కువయ్యెను. తాను జీవింపజాలనని సుబ్బరామయ్య నిశ్చయించి వేంకటరామయ్యనుపిలిచి, నీయొద్ద యిచ్చియుండే సొమ్ములో కొంత కర్చుపెట్టి కర్మ చేయించి కొంత తనపేర ఏదయిన ధర్మమునకు వినియోగపెట్టవలసిందని చెప్పి ప్రాణములు విడిచెను. రెండునెలలు గడచినవి.

సుబ్బరామయ్య చెప్పిన యేర్పాటుప్రకారం వేంకట్రామయ్యయొక పనినికూడా చేయలేదు. రెండువేల రూపాయలు దొరికినవిగదాయని సంతుష్టిని బొందిఉండెను. సుబ్బరామయ్య చనిపోయినపు డతని తలక్రింద గుడ్డలమూట యొకటి యుండెను. దానిని వేంకట్రామయ్య విప్పి చూడగా అందులో అందమైన కాశీశాల్వ యొకటి యుండినది. చూచినవారు యించుమించు ముప్పదిరూరూపాయల వెలగలదిగా నుండవచ్చునని మతింపువేసి చెప్పిరి. తక్కినవేవో రెండుమూడు గుడ్డలున్నూ ఉండినవి. వాటినంతా వాళ్ళవాళ్ళకు పనివాండ్లకిచ్చి వేంకట్రామయ్య శాలువమాత్రం స్వంతవినియోగార్థం పెట్టుకొనెను.

అది చలికాలముగా యున్నందున దానిని నిండా ఆశతో కప్పుకొని ముందరి గుమ్మములోన మంచముమీద హాయిగా పండుకొనెను. ప్రక్కగోడకు తగిలించి చిన్నదిగా జేసియుండే దీపము మినుకు మినుకున వెలుగుచుండెను. ఎక్కడివారక్కడ యనుకూలమైన చోట్లల్లో పండుకొని అలసి గుఱకలుపెట్టుచు నిద్రించుచుండిరి. రాత్రి సుమారు ఒంటిగంటయైనది. అపు డొక విచిత్రసంభవంజరిగింది.

ఉన్నట్టుండి, ఆయన పండుకొనియుండే మంచము నెవ్వరో పట్టియూచినట్లుగా ఉఱ్ఱట్లూగింది. తటాలున వేంకట్రామయ్యకు మెలకువకలిగి వెలికల పండుకొనియుండినవాడున్నట్లే కండ్లు తెఱచి చూచెను. ఒక మనుష్యుడు మంచమునకు దగ్గఱగా నిలిచియున్నట్లు కనబడెను. సుబ్బరామయ్యయే ప్రత్యక్షమైనాడు. స్పష్టముగా సుబ్బరామయ్యయే. చూడగానే వెంకట్రామయ్యకు భయముగలిగినది. ఒడలు వడకుబుట్టినది. నోటిలో తేమ లేదు. పలుకుటకుగాని, యెవరినైన పిలుచుటకుగాని, తుదకు పొరలుటకుగాని, ఆయనకు శక్యముకాలేదు. కొయ్యబాఱెను. తనలో 'అయ్యో! సుబ్బరామయ్య — సుబ్బరామయ్య — చచ్చినాను — చచ్చినాను — దేవుండా! నీవేగతి' యని తలంచుకొనుచు కదలలేక, కన్నులు మూతబడక, దృష్టి సుబ్బరామయ్యరూపముమీద నిలిపి చూచుచుండెను.

రెండుమూడు నిమిషములు క్రిందనిలిచియుండిన సుబ్బరామయ్య చివాలున, యీయయ్యగారి రొమ్ముపై రెండువైపులా రెండుకాళ్లుబెట్టుకొని గుఱ్ఱమెక్కినట్లుగా కూర్చుండి, ఉగ్రమైన చూపులతో చూచుచు. 'ఇవ్వు — నారూపాయలు యేంచేశావు? తే! నాశాల్వా! నాకు యెంతో ముచ్చటగానుండే యీశాల్వా — ఎందుకు నీవు కప్పుకొన్నావ్ — కప్పుకొంటావ్ —

ఇవన్నీ నీసొమ్మనుకున్నావా?— నా రూపాయలున్నూ, శాల్వాయున్నూ యివ్వకుంటే నిన్ను చంపుతాను— బ్రతక నీను— ఇచ్చివెయ్ — ఇచ్చివెయ్' అని బ్రతికియున్నప్పటిలాగే, స్పష్టముగా పలుకుతూ హింస చేయడం మొదలుపెట్టెను. ఆమాటలన్నీ వేంకట్రామయ్యకు గట్టిగా వినబడుతూవున్నాయి. కదలడానికి, పలకడానికి శక్యంకాలేదు, ఏమి చేస్తాడుయింక? పాపము- ఆ ప్రకారం బాధిస్తుంటే పడరాని యాతనకు లోనైనాడు వేంకట్రామయ్య. ఆబాధ ఆయనకే తెలుసు. రొమ్ము అదుముతుంటే—గొంతు నొక్కుతుంటే—ప్రాణము లప్పుడే యెగిరిపొయ్యేరీతిగా వుండిందాతనికి. ఆలా వెతపడుతూవుండే సమయంలో యింట్లో మఱియెవ్వరో మేలుకొని యావెంబడిగా లేచి వచ్చారు బయటపోవడానికి. వారు మంచందగ్గిరికి రాగానే సుబ్బరామయ్య మాయమయ్యాడు.

పోయినట్లుండిన ఊపిరి మళ్ళీ వచ్చింది. ప్రాణాలు దక్కాయి. కష్టసముద్రంలోనుండి గడిచి గట్టెక్కాడు వెంకట్రామయ్య. నాలుగు గంటలు కావచ్చింది. ఎవరికిన్ని చెప్పినవాడుకాడు తన సమాచారమును, లోపలభయం—బయటికి ధైర్యం—మఱి నిద్రలేదు. ఎట్లు వస్తుంది? అంతటిబాధ అనుభవించినవానికి? తనలో యేమేమో ఆలోచిస్తూ, దీపము పెద్దదిచేసి, మంచముమీదనుండక వాకిటికిపోయి కూర్చున్నాడు యోచనచేస్తూను. అంతలో కడుపులో యేమో వికారముపుట్టింది. గళబిళమని కలిగింది పేగులలోశబ్దం. పెరటికిపోవలసినట్లు తొందఱయేర్పడింది. పోయి వచ్చాడు. అదేమొదలు. ఒకటే వాంతులు—ఒకటే విరేచనాలు. సొక్కిపోయ్యాడు. కండ్లు గుంటలుపడ్డాయి. తెల్లవారింది. వేంకట్రామయ్యను చూస్తే పీనుగమొగంపడింది. కారణం యెవరికి తెలీదు. ఆయన చెప్పలేదు. వైద్యులచేత మందులు మాకులు ఆయనభార్యా, వాళ్లు ఇప్పిస్తున్నారు. ఏమిన్ని గుణంలేదు. వాంతులు, విరేచనా లెక్కువగానేయున్నవి. అపుడు వేంకట్రామయ్య భార్యనుపిలిచి పసుపునీళ్ళల్లో తడిపిన గుడ్డను తెప్పించి రూపాయలు పేకాటలోను, యితర కార్యాలకు కర్చుపడిపోయినవనిన్నీ, యోలాగైన రెండుమూడు నెలల్లో సంపాదించి వడ్డీతోకూడా చేర్చి ముందు చెప్పినట్లు పనులు చేస్తాననిన్నీ, శాలువ నెవనికైనా దానంగా యిచ్చేస్తాననిన్ని ప్రార్థన జేసికొని రెండు రూపాయలు పసుపుగుడ్డలో పెట్టి సుబ్బరామయ్య పేరిట ముడుపుగట్టి, సాంబ్రాణిపొగ వేసి మ్రొక్కుకొన్నాడు.

వేంకట్రామయ్య ఈగాబరాలో ఉండేటప్పుడు, నెల్లూరుకు తూర్పు పదిమైళ్ళలోనుండే గ్రామమునుంచి ఆయన మేనల్లుడు (కూతురినిచ్చిన అల్లుడుకూడాను) యేదోపనిగలిగి నెల్లూరికివచ్చి అత్తమామలను చూచిపోవలెనని వారి యింటికి వచ్చినాడు. ఆయనపేరు రాఘవయ్య. అతడు వచ్చి చూడగా మామగారు ఎక్కుడు బాధపడుతూవుండడం చూచి గాబరాపడ్డాడు, వాంతులు, విరేచనాలు అని తెలిసింది. పోలేక నాలుగునాళ్లు అక్కడనే వుపచరిస్తూ వుండినాడు. వేంకట్రామయ్యకు కొంచెం నెమ్మది యేర్పడింది. రాఘవయ్య తనయూరికి పోవడానికి ప్రయాణమైనాడు. అపుడు వేంకట్రామయ్య యోచనచేసినాడు, తనదగ్గఱవుండే శాలువా యితరుల కివ్వడంకంటే అల్లుడికే యివ్వడం మంచిది అని. రహస్యం చెప్పకుండా (చెప్పితే పుచ్చుకోడని) తనరొమ్ముపై సుబ్బరామయ్య యెక్కినమఱునాటి యుదయాన్నే మడిచి దూరముగా దూలంమీద గుడ్డలోచుట్టిపెట్టియున్న శాలువాను తాను తాకకుండా యింకొకరిచే తెప్పించి అల్లుడికిప్పించి 'మంచి శాలువ. దీనిని నీవు వాడుకో' అని చెప్పి యిప్పించెను.

రాఘవయ్య దాన్నిచూచి యుబ్బిపోయినాడు. వెలగలది—అందమైనది. మామ తనకంత గొప్ప బహుమానం చేసినాడని, కృతజ్ఞతకు సూచనగా మందహాసంచేసి శాలువాగొని తమగ్రామానికి పోయి. ఆరాత్రి మామయిచ్చిన శాలువా కప్పుకొని, సంతోషంతో పండుకొన్నాడు, అర్ధరాత్రి వై

[మిగతా ౧౦౨-వ పేజీలో.



*

ఈ సూక్తిశుక్తిజములు వ్రాసినది సుప్రసిద్ధాంధ్రరచయితలయిన శ్రీ కూచి నరసింహము పంతులుగారు. వారు ఇటీవల దివంగతులైనారు. ఈ శుక్తిజములలో తుదిది బహుశః వారి లేఖిని ప్రసవించిన తుది రచనము కానగును. ఇందులో మొదటి నాలుగును వారు మాండలికమైన ఒకానొక మాసపత్రికలో ప్రచురించియున్నారు. వానికి మఱియొకటి కలిపి విశేషప్రచారమును వాంఛించి వారు వానిని మదరాసు పంపియున్నారు. వారు వీనిని మదరాసు పంపి కొన్ని వారములయినది వారు బ్రతికి యుండగా వీనిని ప్రచురించి 'ఆంధ్రభూమి' తన ఋణమును తీర్చుకొనలేక పోయినది. ఇందుకు మేము మిక్కిలి విచారించుచున్నాము. ప్రస్తుతము శ్రీ పంతులుగారి పవిత్రాత్మకు శాంతిని కోరుచు వారి ఈ సూక్తిశుక్తిజములను ఆంధ్రమహాజనుల కరకమలములకు వినీతభావముతో నివేదించుకొనుచున్నాము.

—సంపాదకుడు.

సూక్తిశుక్తిజములు

౧

శ్లో. స్తుత్యానయా వాక్పరతా హతా తే
ధ్యానేన చేతఃపరతా హతా తే
యాత్రాదిభి స్సర్వగతా హతా తే
శంభో క్షమస్వ త్రివిధాపరాధమ్.

(తెలుఁగు)

గీ. ధ్యానమున స్తోత్రమునను యాత్రాదికమున
నీ మనోవాక్పరతలను నీదు సర్వ
గతను జెఱిపిన నామహాఘముల మూఁటిఁ
గరుణ క్షమియించి రక్షింపు గరళకంఠ!

ఈశ్లోకము మహావేదాంతియును, సుధామధురములగు ననేకభక్తిశ్లోకములు రచియించిన మహాకవియును అగు శ్రీశంకరాచార్యులవారి శ్లోకమే యని కొందఱు చెప్పుచున్నారు. కాదిది భక్తిభరితాంతరంగుఁడైన తాత్త్వికుఁ డెవఁడో చెప్పిన చాటువని కొంద ఱందురు. కర్తృత్వ మెవరిదైనను శ్లోకము

మాత్రము భగవద్భక్తులకుఁ బెన్నిధానమువంటి ధ్యానశ్లోక మని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును.

ముక్తికిఁ బరమసాధనము లయిన స్తుతి ధ్యానయాత్రాదు లిందుఁ జక్కని కవితాచమత్కృతితోఁ బరమేశ్వరుని "అవాఙ్మానసగోచర" బిరుదమును, "సర్వవ్యాపక" బిరుదమును బడఁగొట్టు మహాపాతకములుగా వర్ణింపఁబడినవి. ఇది నిందాస్తుతిగాని నిషేధసూచనముగాదు.

సమస్తలోకవ్యవహారములకు స్వస్తి చెప్పుకొని యెల్లశక్తు లుడిగి యింటఁబడియుండు నావంటి డెబ్బదియేండ్ల బసుగున కిట్టి శ్లోకములు మహానుకూలములైన సత్కాలక్షేపసాధనములు గావా?

౨

శ్లో. ఆత్మాత్వం గిరిజామతిః పరిజనాః ప్రాణా శ్శరీరం గృహం
పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః
సంచారః పదయోః ప్రదక్షిణవిధి స్తోత్రాణి సర్వాగిరో
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనం ॥

(తెలుఁగు)

మ. మతి శైలాత్మజ, యాత్మ నీవె శివ, సద్మం బీశరీరంబు, భృ
త్యతతు ల్ప్రాణము లైదు, వైషయికసౌఖ్యావాప్తి నీపూజ సు
ప్తతయోగస్థితి, నీప్రదక్షిణపుఁ గృత్యం బంఘ్రిసంచార, మీ
రిత మెల్లన్ స్తుతి, సర్వకర్మములు గౌరీనాథ! నీసేవలే.

"నాయాత్మ నీవే, నామతి నీభార్య యగుపార్వతియే, నాప్రాణపంచకము నీపరివారజనమే, నాదేహము నీగేహమే, నావిషయానందానుభవ మంతయు నీపూజయే, నానిద్ర నీసాయుజ్యసుఖము నిచ్చు సమాధియే, నాపదసంచార మంతయు నీకు నే జేయు ప్రదక్షిణమే, నానోటినుండి వచ్చుమాట లన్నియు నీకు నే నొనరించు స్తోత్రములే, ఇంత యేల! మనోవాక్కాయములతో నేఁ జేయు సమస్తకర్మజాలమును ఓమహాదేవా! నేను నీకుఁ గావించు సేవయే."

ఈప్రకారముగా అహంకార మమకారములు తుదముట్టఁ బోఁగొట్టికొని యే మహానుభావుఁడో శివతాదాత్మ్యబుద్ధితోఁ బై శ్లోకమును రచించి తదనంతరకాలపు భక్తసంతానమున కమూల్య పైతృకధనముగా విడిచిపెట్టి గతించినాఁడు.

"ఇవి యేటిమాటలు! మనుష్యజన్మము పుణ్యపాపమిశ్రిత మైనది; అతనినోటినుండి మంచిమాటలును, జెడ్డమాటలునుగూడ వచ్చును; అతఁడు చేయు పనులలో మంచివియుఁ, జెడ్డవియుఁగూడ నుండును. ఇట్టిస్థితిలో బూతులు పూతదేవస్తుతులును, చెడ్డతిరుగుళ్ళు శివప్రదక్షిణములును ఎట్లు కాఁగలవు?" అని కొంద అనవచ్చును.

లోఁతుగాఁ బరికించినచో, అట్టిసంశయములు నాబోంట్లపట్లఁ గలుగవచ్చును గాని ఆరూఢు లగు భక్తులపట్టునను, జ్ఞానులపట్టునను వర్తింపవని గోచరించును. పరమాసహ్య మగు పేఁడ అగ్నిదగ్ధమై శుద్ధశుభ్రసురభిళపదార్థ మగు విభూతిగా మాఱి భక్తులెంతయు భక్తితోఁ దమలలాటములందు ధరించుట కర్హమగుచున్నదిగదా! అట్లే క్షుద్రమానవప్రకృతి ప్రబల తీక్ష్ణభక్తిజ్ఞానాగ్నిచే భస్మీభూతమై సచ్చిదానంద భగవతత్త్వముగా మాఱి సర్వజనపూజ్యమగును. అట్టిధన్యులచర్యలును సంకల్పములును పరమేశ్వరుని చర్యాసంకల్పములవలెనే పరిశుద్ధములును, పరమపవిత్రములును, అఖిలజగత్కల్యాణప్రదములును అగును. అట్టి యాదర్శస్త్రీపురుషు లెన్నఁడును అసత్సంభాషణములు గాని, అసత్కార్యములు గాని చేయరు.

౩

శ్లో. గృహే కించిన్నేతి ప్రలపతి కళత్రం ప్రతిదినం
తమేవార్థం బ్రూతే ప్రభురపి చ మానేన మహతా
విరక్త్యా వేదాంతశ్రవణమపి కుర్యాం యది తథా
నిరాలంబో లంబోదరజనని కం యామి శరణం ॥

(తెలుఁగు)

చ. గృహమున నేమి లేదనుచు గేహిని వాఁగుచునుండు నిత్యమున్
మహిపతియున్ దరిద్రమని మౌనముఁ దాలిచి చెప్పవేఁడ, ని
స్పృహతను బోయి విన్నఁ గట! వేదశిఖల్ వచియించుచున్నవై, యే
మహితుఁడు దిక్కు హస్తిముఖమాత! యిఁకన్నను దీనుఁ గావఁగన్.

ఇంటిలో ఉప్పులేదు, పప్పులేదు అని భార్య ప్రతిదినము బాధించుచుండును, ఆబాధనుండి తప్పించుకొనుటకుఁ బోయి ప్రభువును యాచించిన మాతి బిగించుకొని ఆయనయును లేదు పొమ్మనియే చెప్పక చెప్పును. ఇట్టి సంసారముపై విసుగుపుట్టి వేదాంత శ్రవణము చేయఁబోయిన "నీవు లేవు, నేను లేను, ఏమియు లేదు, సర్వము మిథ్య" అను నిరుత్సాహపు టద్వైతవచనములే చెవిని బడును. అమ్మా! జగజ్జననీ! నిరాలంబుఁడ నగు నే నిఁక నెవరి శరణు చొత్తును?—ఇట్లు కళత్రబాధ అణుమాత్రమును లేని ఆ జన్మసన్న్యాసియగు శ్రీశంకరాచార్యుల వారు పై శ్లోకములోఁ జెప్పినారు. ఆయన నిరాలంబాష్టకములోని శ్లోకములలో నిది యొకటి. శ్రీస్వామివారు సదా బ్రహ్మానందమున నోలలాడుచుండు శుద్ధాద్వైతులైనను, సామాన్యసంసారి పడు బాధలు తాము బడుచున్నట్లు భావించుకొని లోకోద్ధరణార్థ మిట్టి భక్తిశ్లోకము లనేకములు రచించినారు. చెఱకుపాకముతోఁ గలిసిన క్షీరమువలె ఆయనశ్లోకము లన్నియు నిట్లే ప్రశస్తకవితారసముతోను, భక్తిజ్ఞానబోధామృతరసముతోను గలిసి మిక్కిలి మనోహరములుగాను, ఆముష్మికఫలప్రదములుగాను నుండును.

౪

శ్లో. రత్నాకరస్తవ గృహం గృహిణీ చ లక్ష్మీః
కిం దేయమస్తి భవతే పురుషోత్తమాయ
అభీరవామనయనాహృతమానసాయ
దత్తం మనో యదుపతే త్వరయా గృహాణ!

(తెలుఁగు)

గీ. గృహము రత్నాకరంబు నీ గృహిణి లక్ష్మి
యే మిఁ కే నీయఁ గలవయ్య కృష్ణ! నీకు?
గోపికాపహృతాంతరంగుఁడవు గాన
జిత్తమర్పించుచుండుఁ జెచ్చెరను గొనుము!

"సమస్తరత్నములకును ఆకరమగు సముద్రము నీ శయ్యాగృహమైనది, సర్వసంపదలను బ్రసాదించు శ్రీదేవి నీ సతియైనది, పురుషోత్తముఁడ వగు నీకు నే నియ్యఁదగిన వస్తువు శ్రీకృష్ణా? నాయొద్ద నిఁ కే మున్నది? ఉన్నది ఉన్నది! గోపవనితలు నీ మనస్సు లాగుకొని పోవుటచే నీవు మనోవిహీనుఁడవై యున్నావు. నా మనస్సు నీ కర్పించుకొని, ఆనీ లోటు తీర్చెదను; కాని మనుష్యులు చపలచిత్తులు, ఇప్పుడీయఁదలఁచుకొను వస్తువు ఉత్తరక్షణమం దీయ నిష్టపడకపోవచ్చును. కనుకఁ గానుకగా నిచ్చు నా యీ చిత్తము నతిశీఘ్రముగా మాత్ర మీవు పుచ్చుకొనవలెను." అని పై శ్లోకము చెప్పుచున్నది.

ఈ చాటువును నాకుఁ జెప్పిన యొకవృద్ధపండితుఁడు దానికి సందర్భించిన యీ క్రింది కథ కూడఁ జెప్పినాఁడు:—సకుటుంబముగా శ్రీజగన్నాథయాత్ర చేసెదనని మ్రొక్కుకొనిన యొకానొక గృహయజమానుఁడు అంతర్వత్నియై యున్న కోడలికడకుఁజని "అమ్మా! నీవు యాత్రకు వచ్చు స్థితిలో లేవు గనుక జగన్నాథస్వామివారి కేమైన నిమ్ము, నీకు మాఱుగా నది నేఁ బట్టుకొనిపోయి స్వామికిఁ బ్రణామపూర్వకముగా సమర్పించెదను" అని చెప్పఁగా నామె పై శ్లోకము రచించి వ్రాసి మామగారి కిచ్చెనఁట. ఆహా! విదుషీమణులును, విష్ణుభక్తావతంసములును కోడండ్రు గాఁగల కుటుంబము లెంత ధన్యములో! అట్టి సత్కుటుంబములతో మన భారతదేశ మెప్పుడును గ్రిక్కిఱిసి యుండుఁగాక!

౫

శ్లో. క్షుత్తృడ్ఢాశాః కుటుంబిన్యో మయి జీవతి నాన్యగాః
తాసామంత్యా ప్రియతమా తస్యాః శృంగారచేష్టితమ్॥

(తెలుఁగు)

ఉ. దారలు మువ్వు రాఁకలియు దప్పియు
నాశయునాఁగ నా; కౌరున్
జేరఁగఁబోరువారు ధరణీస్థలి నే
మను నంతకాలమున్;
వారలలోనఁ దుట్టతుది భార్య
కడుం బ్రియ నాకు; దాని శృం
గారపుఁ జేష్టలే యిటను గాయము
నం గనిపించు గాయముల్!

ధనవంతుఁ డొకఁడు చుట్టు ముండ్లకంచెగల దొడ్డిఁ జొరఁబెట్టి బ్రాహ్మణులకు సంభావన లిచ్చుచుండఁగా, నందొక పండితకవియగు పడుచువాఁడు, అందఱితోపాటు ఒకసారి తనకు సంభావన ముట్టినప్పటికిని, ద్విగుణముగా అది పుచ్చుకొను దురుద్దేశముతో, ముండ్లకంచెలోఁదూఱి యెట్లో పైనుండి దొడ్డిలోఁ బ్రవేశించి, సంభావనకై మరలఁ జేయిచాఁచెను. చీరుకొనిపోయి నెత్తురు చిందుచున్న యతని యొడలి గాయములు గాంచి సంభావన లొసఁగుచుండిన ధనికుఁ డనుమానపడి "ఏమయ్యా! యీరక్తములు గ్రక్కు అక్కు లెక్కడనుండి వచ్చినవి?" అని ఓఱునవ్వుతో నడిగెను.

అంతట ఆ విద్వాంసుఁడు లజ్జా పశ్చాత్తాప పరితప్త చిత్తుఁడై చమత్కారముగా పూర్వోక్త శ్లోకరూపమున ఆధనికున కిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

"అయ్యా! ఆఁకలి, దగ, ఆశ అను ముగ్గురు పరమ పతివ్రతలగు పత్నులు నాకుఁగలరు. నే బ్రతికియుండు నంతకాలమును వారు నన్ను విడిచి యింకొకరికడకుఁబోరు. వారిలోఁ జిట్టచివర భార్యయగు ఆశాకాంత నాకందఱికంటెను ప్రియతమురాలు. మీరిప్పుడు నా మేనిపైఁ జూచుచున్న యీ అక్కులన్నియును ఆవగలాఁడియొక్క నఖక్షత, దంతక్షత రూప శృంగార లాంఛనములే కాని లాఁతి వేమియును గావు!"

అయుక్తమైన యర్థకాంక్ష యెట్టి యుత్తమ వర్ణపు వానికైనను, ఎట్టి విద్వచ్ఛిఖామణికైనను లజ్జావమానహానికరము కాక మానదని యీ చక్కని చాటువు చాటుచున్నది.

— కేశాంచి నరసింహరావు

మాత

చిన్ని బిడ్డను దనచంకఁ జెన్నుమీఱ
నెత్తికొనుచును వానికి నెట్లో దాయి
దాయి, యని బువ్వపెట్టి ముదంబునొందు
మాతృదేవత నెప్పుడు మఱవరాదు.

ప్రొద్దు పొడవకమును దన పుత్త్రు లేపి
ముందుఁ గూర్చుండఁ బెట్టుక మొగముకడిగి
సంతసమున నాతనికిఁ దాఁ జలిది పెట్టి
పాఠశాలకు నాతనిఁ బంపుచుండు
మాతృదేవత నెప్పుడు మఱవరాదు.

పితరుఁ డెప్పుడైనఁ బుత్త్రుఁ గోపింప వలదు
వలదనుచు విచారమ్మున వానిఁ దీసి
తాయిలాలనుబెట్టెదఁ దాళుమనెడు
మాతృదేవత నెప్పుడు మఱవరాదు.

తనదు పుత్త్రుఁడెంతయును విద్యావిహీనుఁ
డైన ననుదినమ్మును వాని డాయఁజేరి
విద్య నభ్యసింపుమనుచు వేఱచెప్పు
మాతృదేవత నెప్పుడు మఱవరాదు.

—చామర్తి వేంకటాచలపతిరావు.

✳

సాధన

చరిత్రలో రజియా అగ్రస్థానమాక్రమించవలసినది. సంకుచితస్వభావులగు చరిత్రకారుల దృష్టిలో ఆమె కొఱగాని దైనది. ఆమె జీవితసుధారసము జీర్ణచరిత్ర పుటలలో నీరసించినది. అందును ఆమె ఆడుది. మూఢమైన ఆచారములకు, స్వార్థమునకు నిలయమైన మానవజీవితము అట్టి ఉజ్వల జీవితములను సహించలేదు. ఆమె జీవితములోని చీకటిని వ్యక్తీకరించినది చరిత్ర; దివ్యకాంతిని స్పష్టీకరించలేకపోయినది. ఇట్టి మహత్తర జీవితము లెన్నో చరిత్ర అనెడి 'డాంటే నరకము'లోబడి, విస్మృతపథములు పట్టినవి.

ఇప్పటికైనను చరిత్రను తిరుగదోడిన తప్ప, లేకపోయిన త్రుప్పుపట్టిన, అసత్యప్రేరితగాథలు చదివి రానున్న జాతి తప్పుడు త్రోవల బోయి, నీచభావముల నాశ్రయించక మానదు.

ఇంచలి పాత్రలు

రుక్నుద్దీన్ — అల్టమష్ యొక్క పెద్దకొడుకు.

అబ్దుల్ ఆలి — మంత్రి.

సుల్తాన్ సులైమన్ — అల్టమష్ యొక్క శత్రువు- రజియాను ప్రేమించినరాజు.

రాంమోహిద్దీన్ — అల్టమష్ యొక్క అభిమాన పుత్రుడు- హిందూయువకుడు [శైశవదశయందు అడవిలో అల్టమష్ రాజునకు దొరకిన బాలుడు]-

హుస్సేన్-ఖాదర్ — అబ్దుల్ ఆలి యొక్క అంతరంగికులు-

ఖాసిమ్ — రాణి సేవకుడు-

రజియా — అల్టుమష్ యొక్క కొమరిత- ప్రస్తుతరాణి-

సుల్తానా — రాజవంశములోని మహమ్మదీయవనిత. రజియా చెలికత్తె. రాంమోహిద్దీన్‌ను ప్రేమించిన యువతి.

✳

సుల్తాన్ రజియా

(చారిత్రక రూపకము)

రచయిత:

చాపరాల సత్యనారాయణమూర్తి, బి.యే.

[అల్టమష్ బానిసరాజు. తన కొడుకులు దుర్బలులు, దుష్టులని తలచి, వీరవనితయు, పిన్నయయ్యు విజ్ఞాననిధియు, రాజ్యాంగధురీణయు అగు కొమరిత రజియాను తన తరువాత రాణిగా నిర్ణయించి దివమలంకరించెను.

మంత్రి అబ్దుల్ ఆలి రాజకుమారుడైన రుక్నుద్దీన్‌ను లోబరచుకొని, రాజ్యాపహరణకు పన్నిన పన్నుగడలు అమానుషములు.

చిరకాలమునుండి అల్టమష్ రాజ్యమునకు గర్భశత్రువైన సుల్తాన్ సులైమన్ విస్తార సేనగలవాడు, బలవంతుడు, — వీనికి దోడు అతడు మిగుల అందమైన మానిసి. అతనిని ప్రేమించి, సమయమునకై వేచియున్నది రజియా. సుల్తాన్ సులైమన్ అందుకు సమ్మతించెను. వీరిరువుర కలయిక ఒక రాజకీయపుటెత్తని రజియాతలపు. కాని ఆమె తలపులో నట్టి అత్యాచారము నిబిడీకృతము కాలేదు.]

౧-వ రంగము

[అడవిలో — మధ్యాహ్నసమయము— క్రీడార్థ మరిగిన రజియా. గుడారములో విశ్రాంతి తీసికొనుచుండును. ఒక పరదేశికుడు ప్రవేశించి, గుడారము వెలుపల నిలబడి రజియారాణిని చూడగోరి, లోనికి

కబురు పంపును- సేవకుడు ప్రవేశించి-]

సేవకుడు :

[సవినయముగా] మహారాణి! ఎవరో పరదేశికుడు...తమ దర్శనార్థం...

రజియా :

[ఆలోచనాపూర్వకముగా]

అజ్ఞ.

[పరదేశికుడు ప్రవేశించి, ఉచితాసనమును స్వీకరించును]

రజియా :

ఏదేశమునుండి... ? మాతో కార్యము...?

పరదేశికుడు :

[ఒక ఉత్తరమునుదీసి, మూడు పంక్తులక్రింద గీతలుగీచి రజియా బల్లపైనుంచును]

రజియా :

[లేఖను పరిగ్రహించి, ఆమూడుపంక్తులను చదువుకొని, శరీరమంతయు స్వేదముచెంద, అంగరఖాలోనుండి చిన్న చిత్రపటమునుదీసి, పరదేశికుడు గమనించకుండా, పరదేశికునివంక, చిత్రపటమువంక పదేపదే చూచి, పోల్చుకొనలేక- అనుమానించి - ఖడ్గధారిణియై- రౌద్రముతో]-

నీ హోదాఏమి...?

పరదేశికుడు :

[ముసుగును తొలగించి, నిజరూపమున ఖడ్గధారియై నిలబడి]

నేనా...?

రజియా :

[గుర్తించి, నిర్వీరపోయి, సిగ్గునుచెంది, ఖడ్గము నొరలోనుంచును]

పరదేశికుడు :

ఢిల్లీపాలకమత్తేభమస్తిష్కమును చిందరవందరచేయు ... సుల్తాన్ సులైమన్—నేను.

రజియా :

[చురచుర చూడ్కులతో] అవును. అట్టి సింహములను నేర్పరితనముతో బోనులలోని కెక్కించగల ధీరయే నేడు ఢిల్లీని పాలించునది.

సుల్తాన్ సులైమన్ :

[సగర్వముగా] మేము వెళ్ళి రావచ్చునా...?

రజియా :

[నునుసిగ్గు దొంతరలుతొలుక] వచ్చినకార్యమేమి...!

[సుల్తాన్ సులైమన్ నిదానించి, కూర్చొనును] వచ్చినకార్యమును చక్కబెట్టుకొని మరీ వెళ్లుట సమంజసము.

[ఆ ఉత్తరములోని మరిమూడు పంక్తులక్రింద గీతలుగీచి సుల్తాన్ సులైమన్ కిచ్చును]

సుల్తాన్ సులైమన్ :

[చదువుకొని] మేము మీకు శత్రుపక్షమువారము. మీదగ్గర నుండి ఈ ఉత్తర మందిన నాటినుండియు నే నా విషయమునుగూర్చి ఆలోచించుచునే యున్నాను.

రజియా :

శత్రువులు మిత్రులుగా మారుచో లోకములో నేమైన ప్రతిబంధకము కలదా...?

సుల్తాన్ సులైమన్ :

నీ విపు డొక మహాసామ్రాజ్యమునకు అధినేత్రివి నీ వనుకొనినంత తేలికగా శత్రువులు మిత్రులు కాగలరా...?

రజియా :

శత్రుత్వ, మిత్రత్వభావములు మానసిక తారతమ్యములు. ఒక హృదయము నిష్కపటముగా రెండవహృదయముయొక్క స్నేహ మభిలషించుచున్నది. . అది తిరస్కరింపబడిననాడు శత్రుత్వము.

సుల్తాన్ సులైమన్ :

[ముసిముసి నవ్వుతో] రెండవ హృదయమును అట్టి స్నేహమునకు పరితపించుచునేయున్నది. కాని ...... కార్యసాఫల్యమెటులా అని...?

రజియా :

[చలించినదై] హృదయము లెపుడును కపటరహితములైనవి. అవి మాయావులగుచో నిప్పటికి ప్రపంచము నరకకూపమయ్యెడిది. నాహృదయప్రబోధిత కార్యము నాకు ఆచరణీయము. ఈరాజ్యము కాని మరి ఏయితరముకాని నా లక్ష్యమునకు వెలిగావు.

సుల్తాన్ సులైమన్ :

[స్తబ్ధుడై- నిదానించి] రాజ్యత్యాగమా...! అది ఆచరణీయముకాదు. అటులగుచో నీ తండ్రి యుద్దేశమును నీవు భగ్నముచే

యేయుచున్నావు. ప్రస్తుత స్థితులు సుఖదాయకముగా లేవు. ప్రజలను శాంతితో, సకల సౌఖ్యములతో పాలించుట పాలకవర్గమువిధి. అటుల చేయగలదానవనియే నీతండ్రి నిన్ను నియమించెను.

రజియా :

సోదరుడు, మంత్రి చేయుచున్న కుట్రలు చెప్పరానివి. ప్రజలనుకూడా హింసించుటకు వారు జంకుట లేదు. నాతండ్రి యుద్దేశము ననుసరించియే వీరినందఱను లెక్క చేయక, రాజ్యమును నడుపుచున్నాను. నాహృదయమున కాప్తులగు మీబోటివారు చేయూతగా నిలుచుచో, ద్విగుణీకృతోత్సాహముతో రాజ్యపాలనము సాగించగలము. కాని...అప్పుడప్పుడు నాకు విరక్తి దోచుచుండును—నన్ను హృదయపూర్వకముగా ప్రేమించు వారు లేరుకదా అని.

సుల్తాన్ సులైమన్ :

ఇంక అట్టిచింత అవసరము లేదు. మేము సర్వదా మీవెనువెంటనే యుందుము. కాని...నీవు తలపెట్టిన కార్యమునకు కొంత కాలము గడచిపోవలెను. ఈలోపుగా ఉభయ రాజ్యముల మధ్య సామరస్య వాతావరణ మేర్పడునట్లు చూడవలెను. కానిచో ప్రజలలో—అందును మీప్రజలలో అలజడి యేర్పడును.

రజియా :

మీరొసగిన సలహాలకు మేమెంతయు కృతజ్ఞులము. ఈరెండు హృదయములు స్నేహపూర్వకముగా ఏకములని చెప్పుటకు గుర్తు...?

సుల్తాన్ సులైమన్ :

ఇదిగో ఈ కుసుమమే. పోయి వత్తుము.

[ముసుగును వైచుకొని వెడలిపోవునప్పుడు ఉత్తరము జారి క్రింద పడును. జారిన ఉత్తరమును రాణి యు చూడలేదు. సుల్తాన్ సులైమన్ నిష్క్రమించినపిదప వచ్చిన రాణి సేవకుడు ఖాసిమ్ దానిని తీసికొనును]

[తెర - ఆలోచనగా]

౨-వ రంగము

[రాత్రి—జాము ప్రొద్దు పోయిన పిదప—ఒక రహస్యమందిరములో—రుక్నుద్దీన్, అబ్దుల్ ఆలి, మఱికొందరు హితులు సమావేశము—]

రుక్నుద్దీన్ :

[మంత్రికి అభిముఖుడై] సరి. మీరుచెప్పినది వాస్తవమే, అందులకు ప్రతీకార మూహించవలయును. ఈ సాయంత్రము నగరములో చాటపంపిన ఆజ్ఞను మీరెటుల ఎదుర్కొనెదరు...?

అబ్దుల్ ఆలి :

[సంకుచితపర్చిన బొమముడితో] నే నిక మారువేషమున రహమన్ అను పేరుతో ఈనగరిలోనే యుందును. నేను ఈ నగరిని విడిచిపోయిననాడు మరణదండన.

రుక్నుద్దీన్ :

[తక్కినవారి మొగము చూచుచు] నగరిలోని ప్రజలు చాట పంపిన రాణి ఆజ్ఞను ఆహ్లాదముతో వినిరని తెలిసినది. వారిని శిక్షించవలెను, ముందు ముఠాదారులను వధింపుడు. తరువాత ప్రజల విషయము చూతము, మన పేరు చెప్పిన పాలుత్రాగుచున్నపసిపిల్లలు సహితము మానవలసినదే.—

[కొద్దిగా మద్యమునుత్రాగి] ఆడుది...! ఆజ్ఞలు...!

అబ్దుల్ ఆలి :

సుడిపెట్టి ప్రజలను వధించి, వారిలో భయమును పురికొల్పవలెను.

[రాజపుత్రునియు, ఇతరులయు ముఖ విలక్షణముల కనిపెట్టుచూ] ఏనాడైనా ఆడుది రాజ్యమేలినదా...? మీవంశమునకు- కాదు మహమ్మదీయ మతమునకే కళంకము. ఘోషావిడిచి, యేనుగుపై దేశమంతయు తిరుగుట మీ వంశమునకు మచ్చ. హిందువులు మనకు శత్రువులు, వారిని వధించుటతో మన అల్లా తృప్తిచెందును.

[అవునని అందఱును తలలూపుదురు] ఈ దేశములోని హిందువులను సహించరాదు. వారు మహమ్మదీయ మతమును స్వీకరించనైనను స్వీకరించవలయును- లేదా అల్లా మనకిచ్చిన ఈఖడ్గమున కెఱయైనను కావలయును.

[రుక్నుద్దీన్—అల్లాహో అక్బరు—అని కత్తిదూసి నిలబడును]

ఇది సమయముకాదు. మన కర్తవ్యమును ముందు కొనసాగించవలసియున్నది. ముందుముందు ఈ స్త్రీపరిపాలనవలన మన మిాహిందువుల ముందు ఇంకను చులకన కావలసియున్నది. త్వరలో నీపాలనకు అంతమును తేవలెను. అశ్రద్ధచేసిన ప్రమాదము వాటిల్లును.

తక్కినవారు :

మంత్రివర్గులకు, రాకుమారులకు తెలియదు కాబోలును. రాంమోహిద్దీనకును సుల్తానాకును వివాహముచేయ నిశ్చయించుకొన్నదట రజియా.

రుక్నుద్దీన్ :

హిందువునకును, మహమ్మదీయ వనితకును పెండ్లియా...! [పండ్లు పటపట కొఱికికొని] ఈ జాతులకు ఇంత సఖ్యము ఎక్కడనుండి వచ్చినది...? ఇది రాణిగారి పాలనా..! [మరల మద్యమును త్రాగి]

నజీర్‌జీ...! మన మతము పాడైపోవుచున్నది.

అబ్దుల్ ఆలి :

నిజము. దీని కొక్కటే ఉపాయము. సుల్తానాను యెత్తికొనిపోయి— రహస్యముగా స్వజాతీయునితో పెండ్లికావింపుడు. ఈదేశము మనము ప్రవేశించినది— ఇస్లాం స్వీకరించని అన్యులను ఖండించుటకే. హిందూ మహమ్మదీయ సఖ్యము కలుగరానిది. అది మన మతమునకు వ్యతిరిక్తము.

రుక్నుద్దీన్ :

నిమిషములో సుల్తానాకు పెండ్లి చేయించగలను. రాంమోహిద్దీన్ సంగతి...? ఈకత్తితో....?

అబ్దుల్ ఆలి :

అది ఇప్పటి పనికాదు.

తక్కినవారు :

జనానా స్త్రీలనందఱను పెండ్లిండ్లుచేసికొని సంసారములు చేసికొనవలసినదని ఆజ్ఞయఁట. వారలట్టుల చేయుటకు గడువీయబడినది. ఘోషా అవసరములేదఁట. పరదా వలదని ఆజ్ఞ.

అబ్దులు ఆలి :

[రాకుమారుని ముఖమును జాగ్రత్తతో పరికించుచు] జనానా స్త్రీలకు పెండ్లిడ్లు...! సరే. రాణికో—! [రాకుమారునకు అభిముఖుడై] ఖుదావంగ్—! వింటివా...! కొంపలంటుకొనుచున్నవి.

రుక్నుద్దీన్ :

[కత్తిదూసి] మహమ్మద్ హో...! [మద్యమును త్రాగి, ఇతరులకు త్రాగనిచ్చి] లేవండి పోవుదము. రాణిని చంపుదము. మిన్నకున్న మితిమీఱిపోవుచున్నది.

అబ్దులు ఆలి :

అదికాదు. ఓపికతో కార్యము సాధించవలెను. ఈ రాజ్యమునకు నీవే రాజువు. నిన్ను రాజునుచేయక నిద్రపోను.

[ఇతరులనుచూచి] మీరు రాజకార్యములందు అప్రమత్తులైయుండుడు. రుక్నుద్దీన్ మనకు మహారాజు. వారి ఆజ్ఞలు మనకు ఆచరణీయములు.

[తక్కినవారు— తలలెగురవేయుదురు] [రుక్నుద్దీన్ లేచి, ఠీవిగా పచార్ చేయును]

[వక్రముగా, ఓరగా— ఇతరుల వంక, రాకుమారునివంక చూచి— కనుబొమలు చిట్లించుకొని] సరి. చెప్పినట్టుల ... కార్యమును ...

తక్కినవారు— రుక్నుద్దీన్— ఓ. తప్పక చేసెదము.

[తెర - తొందరగా]

3-వ రంగము

(ఏకాంతము— అంతఃపురములో నొకగది— రాజకార్యసంబంధమైన కొన్ని కాగితములను చూచుకొని— ఔను— కాదు— అను జబాబులను వ్రాయుచుండగా కలము జాఱి కాలుపై బడి— పాళీ గ్రుచ్చుకొని రక్తము కారును)—

రజియా :

ఇదేదైన భావికార్య సూచనయా...? ఔను. రాజ్యభారము పూలపాన్పుపై పడక కాదు— కంటక కిరీటమును ధరించుటవంటిది. భీకరము. భయంకరము. రక్తభుక్తి.

కాని—

ఈ కంఠములో నూపిరియున్నంతవఱకు నాప్రజలను సుఖదాయకముగా రక్షింతును. హిందూ మహమ్మదీయ భేదములు నశించవలెను. ఉభయ జాతులలో

జీర్ణించి, చివురుచున్న దురాచారములను రూపుమాపజేయవలెను. జాతికి అభ్యుదయమును చేకూర్చుట పాలకజాతి విధి. ముష్కరులు వెంటనంటుచున్నారు. కుటిల తంత్రజ్ఞుడైన అబ్దుల్ ఆలి, మాయమాటలలో చిక్కి సోదరుడు—లాతివాడు ప్రజలను హింసించుటకు వెనుదీయుట లేదు. త్వరలో వీరి సంకటమునుండి ప్రజలను రక్షించవలెను.

అబ్దుల్ ఆలిని దేశమునుండి వెడలగొట్టినను అతని ప్రభావము వీరిని వదలలేదు. రుక్నుద్దీన్ క్రూరుడు. అభము, శుభము తెలియని ప్రజలను క్రూరముగా హింసించుచున్నాడు.

ఈ చిందినరక్తమే- ప్రమాద చిహ్నము. నాకు మేలుకొలుపు. అహోరాత్రములు దీనిని మఱువను.

—(తల పంకించును)

[తెర-వేగముగా]

౪-వ రంగము

(ఏకాంతప్రదేశమున — రహమన్—మరి ఇరువురు ఆంతరంగికులు—హుస్సేన్—ఖాదర్. సంభాషించుచుందురు.)

హుస్సేన్ :

మీరు చెప్పినప్రకారము మందమతియైన రుక్నుద్దీన్‌ను అచ్చానిసాలోనే ఉంచుచున్నాను.

రహమన్ :

భేష్.

(ఖాదర్ వంక తిరిగి) ఖాదర్! క్యా...?

ఖాదర్ :

ముస్లింలకు రజియాపైన బడా ద్వేషమును పురికొల్పితిని. చాలమంది సభలుకూడా చేసికొని, రజియాపైన తిరుగుబాటు నిశ్చయించుకొనినారు.

రహమన్ :

నన్నుగూర్చి ఎవరేమైనా చెప్పుకొనుచున్నారా...?

హుస్సేన్ :

ఆఫ్ఘన్ రాజ్యమునుండి రహమన్ అను భూతవైద్యుడు వచ్చి నటుల చెప్పుకొనుచున్నారు. అబ్దుల్ ఆలి తన కడజీవితమును వెళ్ళబుచ్చుకొన మక్కా వెళ్ళినది రజియాకు వార్తలందినవి.

రహమన్ :

ఈ విషయములో మీరు ఇరువురు జాగ్రత్తగా భోగట్టా చేయుడు. చీమ చిటుక్కుమన్న నాకు తెలుపునది. మీరేది ప్రచారము చేసినను మతముతో ముడివెట్టి సాగించండి ప్రచారము.

హుస్సేన్ :

కాని...ఎక్కువమంది రజియా పక్షపాతులే. పూర్వాచార పరాయణులు మనవైపు. స్త్రీలు రజియాను తమపాలిటి దేవదూతగా పరిగణించుచున్నారు.

రహమన్ :

(పెదవి పండ్లతోనదిమి) మీ ప్రచారబలము చాలలేదన్నమాట. రజియా...దుశ్చరిత, వ్యభిచారిణి. మగవాడు అనిన యెంత అని గర్వపడు స్త్రీ.

ఖాదర్ హుస్సేన్ :

హుం. మన తడఖా చూపించెదము. మగవాడు లేకపోయిన ప్రపంచ మెక్కడున్నది...?

రహుమన్ :

(హుస్సేన్‌నుచూచి). రజియా అంతఃపుర సేవకులలో నొకనిని మనవైపునకు త్రిప్పికొని రహస్యములు గ్రహించవలెను. కాకపోయిన ప్రచ్ఛన్న వేషమున రజియాతో సంభాషించి మర్మముల గ్రహించు టవసరము పోయిరండు.

(నిష్క్రమణ-)

[యవనిక జారును.]

౫-వ రంగము

రాత్రి 7 ఘంటలవేళ : (సభాభవన ప్రాంగణమున రజియా పచార్ చేయుచుండును. సేవకుడు ప్రవేశించి-)

సేవకుడు :

రాణీసాహెబా—! సలాం.

రాంమోహిద్దీన్ సేనాని- తమ దర్శనార్థం.

రజియా :

శీఘ్రముగా...లోనికి-

(సేవకుడు వెడలిపోవును. రాం మోహిద్దీన్ ప్రవేశించి– ఉచితాసనము గ్రహించును—)

రజియా :

...పని ?

రాంమోహిద్దీన్ :

మీ ఆజ్ఞానుసారముగా ఢిల్లీ పట్టణములో చేరెదరని గస్తీ నియమించినాను. అబ్దుల్ ఆలి మక్కా–వెడలిపోయెనని వింటిని.

రజియా :

అబ్దుల్ ఆలి వలని కలుగుప్రమాదము గొప్పది. రుక్నుద్దీను– అతని అనుచరులు కూడా చాలా ప్రమాదమైనవారే. పాలకులపైకి ప్రజలను పురికొల్పుచున్నటుల తెలియవచ్చినది. ఆవిషయములో తగు జాగ్రత్త తీసికొనవలసిన బాధ్యత మీది.

ఒక్కవ్యక్తిగదా అని విడిచితిని అబ్దుల్ ఆలిని. వీలుతప్పినచో రుక్నుద్దీనును వెంటనే ఖైదీగా పట్టవలెను. రహమను అను ఆఫ్ఘను భూతవైద్యుడొకడు ఢిల్లీ బజారులలో తిరుగుచున్నటుల తెలిసినది. వానిపై నిగా ఉంచుడు.

అయితే...సుల్తాను సులైమను దగ్గరనుండి వార్తలేమైనా వచ్చినవా ?

రాంమోహిద్దీన్ :

(వెలవెలపోయి. రాణి గమనించకముందే తెప్పరిలి)

ఏమీ తెలియరావు.

సుల్తానా తమ సాన్నిధ్యమందు కనిపించుటలేదు...మరి...

రజియా :

(చిరునవ్వుతో) ఆమె కొలది దినములనుండి అస్వస్థతగానున్నది. అది కారణముగ నేను లేని సమయములో రాజకార్యముల నిర్వర్తించలేని స్థితిలోనున్నది. అదియునుగాక జనానాలో కుట్రలు మొలకలెత్తు సూచనలు కనిపించుచున్నవి. నమ్మకమైన దాసీలతో ఢిల్లీకి ఉత్తరముగానున్న మఠములో మారువేషమునన్నది. అవసరమగునెడల కలిసిమాట్లాడుము. మరి విశేషములు లేవుగదా—?

రాంమోహిద్దీన్ :

ఉన్నచో తమకు బేగీ తెలిపెదను.

(నిష్క్రమణ–)

[యవనిక]

౬–వ రంగము

(అర్ధరాత్రి— రహస్య ప్రదేశమందు— రహమను— రుక్నుద్దీను కూడి సంభాషించుచుందురు.)

రహమన్ :

మీరు చెప్పినది బాగుగానే యున్నది. నామీద అనుమానం కలిగింది కనుక ఇకమీదట నేను పిచ్చివాడుగా ప్రవర్తించెదను.

"సుల్తాన్ సులైమను నుండి వార్తలేమైనా వచ్చినవా...? అని ప్రశ్నించినదట...!

రుక్నుద్దీన్ :

హుస్సేన్ ఇంకా దానినిగూర్చి వివరములు సంగ్రహించలేదా...? సుల్తానుసులైమను ఈరాజ్యమునకు– అంతేకాదు రజియాకుశత్రువే.

(ఖాసిమ్‌ను వెంటబెట్టుకొని– హుస్సేన్ వచ్చి వారిని చేరును. ఖాసిమ్ రుక్నుద్దీనునకు సలాంచేసి కూర్చొనును)

రుక్నుద్దీన్ :

(హుస్సేన్ వైపునకు తిరిగి) ఖాసిమ్ అచ్ఛామానిసి.

హుస్సేన్ :

జహాపనా–! అతడు చాలామంచివాడు.

రుక్నుద్దీన్ :

(హుస్సేన్ వంక సంజ్ఞాపూర్వకముగాచూచి). ఖాసిమునకు నీకు చిన్నతనమునుండియు దోస్తీ...

హుస్సేన్ :

ఖాసిమ్ పెద్ద కుటుంబీకుడు. పేదవాడు. ఐనూరు నాణెములు... (రుక్నుద్దీను సంచిని ఖాసిమ్‌ముందుంచును) ఖాసిమ్–! నీకేమీ ఫరవాలేదు, ఈ గందరగోళములో ఉద్యోగములుండును. ఉంచును— కనుక... (ఖాసిమ్ దిగాలాపడిన మోముతో. అంగరఖాలోనుండి ఒక ఉత్తరమునుదీసి రుక్నుద్దీనునకు ఇచ్చును. నాణెముల సంచిని ఖాసిమ్ ఒడిలోపెట్టును హుస్సేను) ఇంకేమైనా విశేషములున్న రాకమారులతో విన్నవించుము. భయపడకుము.

ఖాసిమ్ :

నాకేమియు తెలియదు. నా పేరుమాత్రము ఎక్కడా తేవద్దు.

(వంగి అందరికి సలాంచేసి- వెడలిపోవును.)

(ఉత్తరమును రుక్నుద్దీను రహమనుకు ఇచ్చును.)

(రహమను ఉత్తరమును తక్కినవారికికూడా వినబడునటుల నెమ్మదిగా చదువును. కొంతసేపు అంతా స్తబ్ధులై మిన్నకుందురు.)

రుక్నుద్దీన్ :

(నిలబడి-కన్నులెఱ్ఱజేసి) సుల్తైమన్ ! ఈనాటికి ఈరాజ్యమును కబళించపోవుచున్నావుగా...? ఆడపెత్తనమువచ్చినది. రాజ్యప్రతిష్ఠ భంగమైపోయినది. అల్టమష్ అనిన సుల్తైమన్‌కు సింహస్వప్నము. ఆ అల్టమష్ కూతురుని- సుల్తైమన్ పెండ్లి యాడుట——! ప్రణయలేఖలా...! రజియా...! నీ ఆడబుద్ధి- లొంగిపోయి...వానికి దాసోహమ్ అనుచున్నది.

(కత్తిదూసి)- మంత్రిజీ-! నేనిక భరించలేను. రజియాను; సుల్తైమన్‌ను ఈకత్తితో హతముచేయవలసినదే- (అని బయలుదేరును- హుస్సేను ఆపును.)

రహమన్ :

ఏకార్యముచేసినను సమయము కనిపెట్టి చేయవలెను. మన మింకా ఎన్నో కార్యములు పూర్తి చేయవలసి ఉన్నవి. నెమ్మదిమీద కార్యములు...సుల్తానాను అపహరించి తీసికొని రావలెను. రజియా, సుల్తైమనుల వివాహవిషయము ముసల్‌మానులలో చాటి, వారి ద్వారా గల్లంతులు చేయించుట ఉచితము. తరువాత రాణిని బంధించవచ్చును. ఓర్పు వహింపుము. ఆవేశమునకు తరుణముకాదిది, కర్మవీరుడవుగమ్ము.

(కత్తి నొరలోత్రోసి- గోడకు ఆనుకొని నిలబడును రుక్నుద్దీను. రహమను హుస్సేనువైపునకుతిరిగి)

మిగిలిన పనినికూడా నీవే నిర్వహింపుము. ఇప్పుడు అర్ధరాత్రమైనది. రహస్యమందిరములో ఖైదీగా నుంచుము ఆమెను.

రుక్నుద్దీన్ :

సుల్తానా, రాంమోహిద్దీనుల విషయము నీవు- రజియా, సుల్తైమనుల విషయము నేను శ్రమపడి బందీకృతులుగాజేసి - మంత్రిజీకి ఒప్పగించుదము. ఆమీద ఆయన శుక్రనీతి——

రహమన్ :

(చకితుడై - పెదవులనదిమి)- రాకుమారులు చక్కగా పలికిరి. హుస్సేను-! జల్దీ-

(నిష్క్రమణ-)

[తెర-తొందరగా]

౭-వ రంగము

(తెల్లవారుజామున 4 గంటల వేళ- అశ్వారూఢుడై రాంమోహిద్దీను కోటముందు నిలిచి, సేవకునితో లోనికి రాణిదగ్గరకు కబురుపంపును- వెంటనే సభాభవనము ప్రవేశించుమని ఆజ్ఞ. అలజడితో రాంమోహిద్దీను సభాభవనములో కూర్చొనియుండును. రజియా ప్రవేశించును)

రజియా :

(శంకించుచు)ఇప్పుడే మరల...?

రాంమోహిద్దీన్ :

ఇప్పుడే మరల ఏమి...?

రజియా :

(నొసలు చిట్లించి) సందెకడ వచ్చి మాట్లాడి వెళ్ళితివికదా...!

రాంమోహిద్దీన్ :

మహారాణి-! సందెకడ మిమ్ములనే సందర్శించలేదు. నేను రాంమోహిద్దీనును, మీకు నిద్రాభంగము కలిగినది.

రజియా :

ఏం...? రాంమోహిద్దీను! నేను రజియారాణినని గ్రహించకలిగితివా—? ప్రజల అభ్యుదయమే జీవితయజ్ఞముగా ప్రయాసపడుచున్న అచంచలశీలయగు రజియా యని గుర్తించితివా——? ఏమి నీ విపరీత ధోరణి...?

రాంమోహిద్దీన్ :

క్షమించుడు. ఇంతకు పూర్వము ఈరాత్రి మిమ్ములను నేను దర్శించలేదు. మఠములో కాలము గడుపుచున్న... సుల్తానాను... ఎవ

రో... ఏవరో... ఎవరో... రాంమోహిద్దీను ఆకృతితో అపహరించిరట. ఇప్పుడే ఈవార్త నాకందినది. మీకడకు నేనిటు వచ్చితిని.

రజియా :

ఏమి...? ఏమి...? ఏమి...? రాంమోహిద్దీను—! మోసము జరిగినది. నీ ఆకృతియే ఆపెకు ఆపద తెచ్చినదా...? నీ ఆకృతితో రాత్రి 7 గంటలకు నన్ను ఒకవ్యక్తి కలిసికొని...రహస్యములు సంగ్రహించెను—దాని ఫలితమిది.

ఆహా! అర్థమైనది. అబ్దుల్ ఆలి మక్కాకు వెళ్ళలేదు. ఇచటనే ఉన్నాడు.

(లేచి– సాయుధపాణియై– భీకరముగా) నిజముగా సుల్తానా స్త్రీ. భారతనారులకు శిరోరత్నము. హృదయము కరుణామయము– రసార్ద్రము– సుకుమారిణి– అట్టిసుల్తానాపై నయా నీతంత్రములు– అబ్దుల్ ఆలి? సుల్తానా నీకేమి కీడు చేసినది–? ఇక నాముందు సాగవు నీతంత్రములు.

(అప్రయత్నముగా అశ్రువులు కారుచుండును) రాంమోహిద్దీను–! లెమ్ము. ప్రతికక్షులను చీల్చి చెండాడెదము.

రాంమోహిద్దీన్ :

(విషణ్ణుడై) ఎంత విపత్తు జరిగినది...! మీరుమాత్రము కోట విడువతగదు. జరుగవలసిన కార్యకలాపమంతయు నే జరిపెదను.

రజియా :

(ఆవేగముతో). సుల్తానాను ఏమిచేసెదరో క్రూరులు?

రాంమోహిద్దీన్ :

ఖైదీగా నుంచుదురు. మనలనందరను పట్టుటకై ప్రయత్నించుచుందురు. మనము తగుజాగ్రత్తలోనుండి, సుల్తానాను విడిపించి, ప్రతికక్షులను బంధించవలెను.

రజియా :

అబ్దుల్ ఆలి జాడల వెంటనంటనంటవలయును. వీళ్ళందరు మానవులుకదా– వారికి మానవ హృదయము లున్నవికదా– ఎంత క్రూరులైనప్పటికి. అని యూరకుంటిని. ఎన్నో ఆదర్శకార్యకలాపములను రాజ్యములో సంక్రమింపజేయ నిశ్చయించుకొని– అనవసరపు అలజడిని ప్రజలలో కలుగజేయ నిష్టములేక మిన్నకుంటినిగాని– లేనిచో నిప్పటికి వీరలేమయ్యెడివారలో:..!

రాంమోహిద్దీన్ :

కొలది దినములనుండి ఆఫ్ఘను దేశీయుడొకడు మన నగరములో తిరుగుచున్నాడు. నేటి అర్థరాత్రమందు ఒక ఉన్మాదుడు ఫకీరు వేషములో– వీధులవెంట గోల చేయుచున్నాడని వింటిని.

రజియా :

ఆ విదేశీయుని, ఆ ఉన్మాదుని కనిపెట్టి– అవసరమగుచో తగు బందోబస్తీలో నుంచుడు. అశ్రద్ధ తగదు.

రాంమోహిద్దీన్ :

మీయాజ్ఞ.

(నిష్క్రమణ-)

[యవనిక-మెల్లదిగా]

౪-వ రంగము

(ఢిల్లీనగరు బజారులలో—ఒక పిచ్చివాడు పాటలతో...చాలా మంది పిల్లలు వెంటబడి—హేళన చేయుచుందురు.)

పిచ్చివాడు :

ఇది ఢిల్లీ బజారురా
దివ్యమా బజారురా
మేడలెంతో పెద్దవి
మేలైన గోడలు.

పిల్లలు :

హే, హే, హే.

పిచ్చివాడు :

రాజూ లేడురా
రాజ్యమున్నాదిరా
చంద్రుడూ లేడురా
చలువ వెన్నెలున్నదిరా–

పిల్లలు :

ఓ, ఓ, ఓ.

(ఈపాటలు వినుటకు ప్రజలు గుమికూడుదురు. సంచిలోనుండి ఒక ఎముకనుదీసి)

పిచ్చివాడు :

ఇదిగో చూడండయ్యా
దీనిమహత్త్వ మిన్నండయ్యా
చిటికేసి నిమిషములో
కీడు తెలిపేను–

(దూరాన బజారుచివర రుక్నుద్దీన్‌నుచూచి, పిచ్చివాడు ప్రజల నుండి తప్పించుకొని...ఏవో కొన్ని పాటలు పాడుచు వెడలిపోయి ఒక గొందిలో వానిని కలిసికొని— అటునిటుచూచి)

రాజకుమార్—ఏమిసంగతి—?

రుక్నుద్దీన్ :

(గుర్తించి) మీతో చిన్న మాట.

(పిచ్చివాడు సమీపించగా)

సుల్తానా...?

పిచ్చివాడు :

అచటనే మన మనుకొనినచోట— తూర్పు బజారులో— చిన్న మేడలో, ఇంతవరకు కలిసికొనలేదా!

రుక్నుద్దీన్ :

మరల మిమ్మెచట కలిసికొందును—?

పిచ్చివాడు :

ద్వాలతాబజారులో—

(నిష్క్రమణ—)

[తెర]

౯—వ రంగము

(రహస్యగృహమున చింతతో సుల్తానా కూర్చొని యుండును. ఆవలిగా రుక్నుద్దీన్ ఆసీనుడు. చాటుననిలబడి, రహస్యమును వినుచుండును ఒక ఆకృతి—)

రుక్నుద్దీన్ :

నేను చెప్పినప్రకారము నడచెదవా...లేదా?

సుల్తానా :

నాహృదయసమ్మతముకాదు.

రుక్నుద్దీన్ :

హృదయమనిన...?

సుల్తానా :

అది ఒక అంతర్వాణి.

రుక్నుద్దీన్ :

అనిన...? దానితో మనకేమి సంబంధం...?

సుల్తానా :

ఇది చేయవచ్చును— అది చేయకూడదు అని బోధించును. హృదయమును మినహాయించగా మిగిలిన మానవజీవితము దుర్భరము. ఘోరము, హృదయము పూజామంటపము. ప్రేమ కుసుమము అచట అర్పింపతగినది.

రుక్నుద్దీన్ :

ఆ కుసుమమును ఇంకొకచోట అర్పించిన...?

సుల్తానా :

(విసుగుతో) ఒక పూజతోనే వాడిపోవును. రెండవపూజకు పనికిరాదు.

రుక్నుద్దీన్ :

(భీకరముగా) ఇట్టి వేదాంతము మాకు వలదు. జీవములపైని ఆశలేదా...?

సుల్తానా :

ప్రపంచములో నేనిక ఆశించతగినవస్తువు లేదు. నాకు భయము నులేదు. నేను భారతనారిని. నా ప్రాణములు పోవలసివచ్చుచో— మరికొన్ని ప్రాణములు కూడా...

రుక్నుద్దీన్ :

రాంమోహిద్దీన్‌ను పెండ్లి చేసికొని అందలమెక్కవా...?

చాటున నిలబడిన ఆకృతికి శరీరము జలదరించును)

సుల్తానా :

నాప్రేమ అతని హృదయమంటపమున ఇదివరకే పూజాద్రవ్యముగా జోహారు చేయబడినది—

(చాటునఉన్న ఆకృతి— ఉత్సాహముతో దీర్ఘనిశ్వాసమును విడుచును)

రుక్నుద్దీన్ :

అతడు హిందువు. అతడు కాఫర్ మనక్రింది నౌకరు. హీనుడు. అతనికి దేవుడు లేడు. మతము లేదు.

(చాటునఉన్న ఆకృతి భీకరమూర్తిఅగును)

సుల్తానా :

పరదూషణ ఆత్మగౌరవచిహ్నముకాదు. అతడు హిందూదేశస్థుడు— హిందువు. నేనూ హిందూదేశస్థురాలను— హిందువును.

రుక్నుద్దీన్ :

నీవు మహమ్మదీయ వనితవు. హిందువుకావు.

సుల్తానా :

'హిందూ' అనునది ఒక జాతి కాదు. ఒక కులముకాదు. ఒక కుటుంబముకాదు. అది ఒక ప్రదేశము. ఆ ప్రదేశమునుబట్టి ఈదేశమునకు ఆపేరు వచ్చినది. ఈ దేశములో పుట్టినవారు, పెరిగినవారు, ఉన్నవారు అంతా హిందువులు. మనమందరము హిందువులమే.

రుక్నుద్దీన్ :

ఝూట్. జాగ్రత్త. మనమంతా హిందువులమా...?

నేనుచెప్పునది వినుము. నీది గొప్ప హృదయ మనుచున్నావు. రాంమోహిద్దీన్ సేనాని. సేనానులకు హృదయమెక్కడిది...? మరి నీకు మంచి...

(చాటునఉన్న ఆకృతి తలపంకించును.)

సుల్తానా :

రాజకుమార్–! చాలు, కట్టిపెట్టుము. వృత్తినిబట్టి హృదయమును నిర్ణయించ వీలులేదు. కసాయివానికి కూడా హృదయమున్నది. సేనానియు మానవుడే. అతనికి సుఖదుఃఖములున్నవి. అతనిదీ రక్తమయశరీరమే–

రుక్నుద్దీను :

(వికతోపాయుడై) ఇదిగో–! నిన్ను చంపెదను.

(కత్తిదూసి, ఝుళిపించును)

సుల్తానా :

(కత్తినితీసి నిలబడి) నీవు మగవాడవనియా గర్వము–?

రుక్నుద్దీను :

(సిగ్గుచెంది– వెలుపలికి– ప్రక్క రహస్యగృహమున రుక్నుద్దీన్ యొక్క అనుచరులు చాటున నిలబడిన ఆకృతినిచూచి– రుక్నుద్దీను అచటేల నిలబడెనో తెలియక మథనపడుచుండిరి. ఇంతలో రుక్నుద్దీను లోపలినుండి బయట దర్వాజాదగ్గరకు– ఎఱ్ఱబారిన మోముతో, విసుగుచెందిన తనువుతో, భీకరమైనమూర్తితో వచ్చి తొంగి చూచి– చటాలున లోనికిపోవును. రెండవగృహములోనుండి కనిపెట్టుచుండిన రుక్నుద్దీన్ అనుచరులు—. రెండు ఏకమూర్తులనుచూచి, దిగ్భ్రమచెంది, చాటుననిలబడిన ఆకృతిని అనుమానించి, ఖడ్గధారులై నలువైపుల వేచియుందురు)

రుక్నుద్దీను :

(సుల్తానాను ఉద్దేశించి)

నాగొంతులో ఊపిరి యున్నంత కాలము రజియా ఆటలు సాగవు. మీరిరువురు మహమ్మదీయజాతికి, మతమునకు, ప్రతిష్ఠకు తొకచుక్కలు. ఇక రజియాను బంధించి– మిమ్ములను హతాశుల చేయగలను.

మీకు తోడు రాంమోహిద్దీను? అతని ఆలోచనలు మీకు గణనీయములు కాబోలు...!

(చాటున నిలబడిన మూర్తి చలించును)

సుల్తానా :

రజియానుపోలిన స్త్రీని ఎన్ని యుగములు గడచినపిదపనైనా చూడజాలవు. ఆమెహృదయము విశాలము ; ఆపెనడత నిర్వక్రమైనది; ఆమె సంస్కారాభిలాషిణి. సంస్కారము మానవజీవితమునకు అభ్యుదయచిహ్నము; ఆమె కోరునది సర్వమానవజీవనకల్యాణము నాపాదించు సలక్షణ పాలనా విధానము. ఆమె లక్ష్యము మహత్తరమైనది. దాని అంతరార్థము మీబోంట్లకు గ్రాహ్యము కానేరదు. సముద్రములో అలల లేపుట నీవశమొట్లు కాదో– ఆపుటయు నీవశము కాదు. అటులే మానసిక సంస్కారము రేగినపిదప దాని ప్రభావమును అడ్డుకొనుటకు నీవుకాదు– విశ్వప్రకృతియే చాలదు. ఆమె నశించి

పోవచ్చును. ఆమెను నీవు హత్య చేయవచ్చును. ఆమె లేపుచున్న ఈ తుపాను నశించునదికాదు.

రుక్నుద్దీను :

ఆఁ...! కవిత్వము చాలా తెలుసును? ఈవెర్రి తలపులే నిన్ను ఇంతవరకు దీసికొని వచ్చినవి.

(మద్యమును త్రాగి)

మీరు హిందూ, మహమ్మదీయులను ఏకముచేయుచున్నారు- అది చేయరాని నేరము. ఈదేశములో మహమ్మదీయులో- హిందువులో ఒక జాతియే యుండవలెను. రాంమోహిద్దీన్ చెప్పు కుతంత్రములకు మీరు లొంగిపోవుచున్నారు.

(చాటుననున్న మూర్తి ఆవేశపరుడగును)

అవును. నీవు రాంమోహిద్దీన్‌ను పెండ్లిచేసికొందువు. రజియా సుల్తానన్‌ను పెండ్లియాడుదును. ఇవియే మీ ఆదర్శములు. వెఱ్ఱితలపులు- వెఱ్ఱిఊహలు- ఇందుకు ఇన్ని ప్రలాపములేల...!

సుల్తానా :

నీ వాచాలతను ఆపుము.

రుక్నుద్దీన్ :

(రుద్రమూర్తియై- మద్యమునుత్రాగి) వాచాలత-! వాచాలత!!

(సింహగర్జనముచేసి)

జాగ్రత్త. ఈకత్తికొనతో నీ గుండె రక్తమును...

(ప్రమాదము వాటిల్లుచున్నదనుకొని చాటుననున్న మూర్తి కత్తిదూసి లోనికి ప్రవేశించబోవు సమయములో లేచియున్నవారలు పట్టుకొందురు. జరిగిన సంఘర్షణలో రుక్నుద్దీన్ అనుచరులకు ప్రమాదమువాటిల్లెను. చివరకు అతడు బందీకృతుడాయెను)

[తెర - తొందరగా]

—సశేషము.

అనంతకోటినక్షత్రాలు

అంకితము.

[ప్రేమపూర్వకంగా :—శ్రీ పాటిమళ్ళ కృష్ణదాసుగారికి.]

రచయిత :

మోతుకూరు వేంకటేశ్వర్లు

'—మగపిల్లవాడు, యేడవడంలేదు' అన్న టెలిగ్రాం మాసుకొని- అప్రయత్నంగా జేబులోని 'రెండణాలు' తీసి యిచ్చా- బంట్రోతుకి!

యేమనుకున్నాడో యేమో! యెగాదిగా చూచి- వెళ్ళిపోయాడు.

స్నేహితులందరూ చుట్టుముట్టారు.

—చేతిలోవున్న 'పదివేల రూపాయల' కథల ప్రూఫులు క్రిందపడేసి నేనూ కూచున్నా !

'యెక్కడినుంచి?' నారాయణ ప్రశ్న.

'ప్రమాదము యేమీలేదుగా!'—అని రామారావు పరామర్శ.

లేదని నవ్వుతూ- తలూపాను.

'మరి- టెలిగ్రాం యేంటీ-?' అని లక్ష్మణరావు.

యేమీలేదులే!- అని నవ్వాను.

'ఓహో - మనకు బాల్ యెప్పుడు చేస్తావేం?-' సాంబశివరావు గ్రహించినట్లు మాట్లాడాడు.

'ఆ- ఆ- అదేనా?- కొడుకా, కూతురా!' అందరూ ఒకేసారి అడిగారు.

నవ్వుతూ చూపించాను.

'—తప్పదు మరి బాల్ చేయాలి.' సాంబశివరావు తిరిగి అడిగాడు.

చూసివచ్చిన తరువాత చేస్తానులే, అని నమ్మించి రూములోనుండి యింటికి వచ్చాను.

వంట్లో నీరసంగావుంది, ఆఫీసుకు సెలవుపెట్టి పండుకున్నా !

—టెలిగ్రాం వచ్చిందని తెలుసుకొని, యింటిల్లపాదీ ఆనందించారు. సంతోషించారు.

'అయిదో నెలనుండి జబ్బే వదినకు- మందులవేడికి, కాగికాగి- పుట్టుంటాడు పిల్లాడు- మొండి ఆయుస్సు' అంది, చెల్లెలు రమణ సంతోషంగా !

'యిచ్చినవాడు మరచిపోతే, అదే చాలు-' నాయనమ్మ అంది ఆనందంగా!-

''చిట్టిమాటకు రగిలి
చెలగు సంతోషంబు
మురిపెంపు నాయెదకు
తగని సౌఖ్యజ్వాల'

మొగలిపూలలోని వేయిరేకుల మత్తువాసనలా?- సుగంధ నిర్మలధూమరేఖకు ఆనందించిన మనస్సులా?- యెందుకో హృదయం విప్పారింది.

'యిరవై యేళ్ళన్నాలేవు- అప్పుడే తండ్రయ్యాడు' అంటూ- శీతల మృణాలవంటి చేతులతో నవ్వుతూ తలనిమిరింది- మా అమ్మ!

ప్రసవించింతరువాత చేయిద్దామనుకున్న చిన్నగడ్డాన్ని చేత్తో రాసుకుంటూ,- యిరువైనాలుగోఏడయినా?- యిరవై సంవత్సరాలే తనకొడుక్కు- అంటున్న తల్లిప్రేమకు విస్తుపోతూ- చిన్నగా పెదిములపైన నవ్వాను.

'టెలిగ్రాంయిచ్చారు వెళ్ళన్నా !' అంది చెల్లెలు.

'చూసిరారా!' అంది నాయనమ్మ.

—యింట్లో అందరితాఖీదీ యెక్కువయింది.

వసారాలో, ఓమూల- పైనుంచి పడిపోయి, ప్రాణంవిడచిన పిచ్చుక పిల్లను చీమలు పట్టుకుంటే- దూరంగా, గోడపైవున్న తల్లి అయోమయంగా అరుస్తుంటే- చూస్తూ సరేనన్నా !

నీరసంగా వున్నందువల్ల వెళ్ళలేక ప్రొద్దున్నే వెళ్దామనుకొని- సారస్వత సమితి తరఫున 'పదివేలరూపాయలు' కథానికల సంపుటి ప్రింటు అవుతుంటే- ప్రూఫులుదిద్ది, సమితి ఆశయంవ్రాసి- కంపోజ్ చేయించి- సాయంకాలం పార్కులోకి బయలుదేరా !

'కొంచలేను, కొంచలేను.' అనే గీతాన్ని రేడియోనుండి రసవత్తరంగా లక్ష్మీరాజ్యం పాడుతుంటే—నా అంతస్సుందర చైతన్యం మేల్కొని, మలయమారుత భృంగాల్లో మిళితమైపోయింది.

* * *

మామూలు దుస్తులతో వుదయంబండికి- స్టేషనుకుచేరుకొని, పెట్టెలో కూచున్నా!—

నురుగలు క్రక్కుతూ బండి పరుగెత్తుతుంటే, అయోమయంగా పండుకున్నా !

—విభ్రాంతుల్నిచేసి, పాఠకుల కోకనీతిని చూపించి- హృదయాన్ని కలచి

[మిగతా ౧౦౧-వ పేజీలో.

సంగమ్మ

'ఎఱుక చాలనివాఁ డంద మే దధీచి,
నల్పబుద్ధులె మేఘవాహనుఁడు, శిబియు
ధరఁ 'బరోపకారార్థ మిదం శరీర'
మనెడు వాక్యంబు వినవె? సంయమివరేణ్య!
అధ్రువంబైన మలభాండమైన దేహ
మనఘ! యన్యోపకారార్థమై వ్యయించి
ప్రవిమలంబుఁ గల్పాంతరధ్రువమునైన
కీర్తి కాయంబుఁ గైకొంట కార్తి యేల?'

—హరవిలాసము.

చిఱుతొండనంబి చిరంటి తిరువెంగనాంచి కడుపునఁబుట్టిన కూరిమి కొడుకును, సుకుమారమూర్తిని, కులవర్ధనుని, సిరియాళుని చిత్రవధచేసి శివయోగికి ఓగిరముగా వండిపెట్టిన పురాణకథ ప్రఖ్యాతమై ఉన్నది.

ఆపురాణకథతోఁ బురుడించు ఆంధ్రచారిత్రకగాథ యొకటి ఇచట ప్రస్తరింపఁబడుచున్నది.

ఈ కథానాయక నామము సంగమ్మ.

చిఱుతొండని చిరంటివలె సంగమ్మయు నసామాన్యమైన పుత్రస్నేహమును దిగఁద్రావినది; చెక్కుగీటిన వసవల్చుం జిఱుతవాని చిత్రమరణమును ధైర్యచిత్తముతో నోర్చినది.

పరార్థమై తనూధనమును, సంతానధనమును వ్యయింపఁగలుగుటయే జననైకఫలమను స్వకీయ విశ్వాసముతో నపూర్వమైన ప్రాణత్యాగ మొనర్చి ఆంధ్రమహిళ సంగమ్మ లోకారాధనీయయైనది.

కావున ఆపూజ్యురాలి పుణ్యచరిత్రమును విని పునీతులుగండు.

విద్యానగరరత్నసింహాసనాధీశ్వరుఁడైన ప్రౌఢదేవరాయల సరదారులలో గోన కాటారెడ్డి ఎన్నికగన్నవాఁడు. కులమునకు ఆతఁడు తెలగ. అతనిది మిడిమెళ్ల గోత్రము. కాటారెడ్డిచేసిన సేవకు మెచ్చి రాయలవారు మగదత్తి, రాయచూరు అను గ్రామములందు కోటలు నిర్మించుటకు ఆతనికి ఆజ్ఞనిచ్చిరి.

రాజాజ్ఞ తలనిడుకొని కాటారెడ్డి మొదట మగదత్తిలో కోట కట్టుటకుఁ బ్రారంభము చేసెను. పని చురుకుగా జరిగెను. బురుజులు తీరి కోట అచిర కాలముననే పూర్తియయ్యెను. అనంతరము కాటారెడ్డి రాయచూరు గ్రామమున కోట కట్టుటకు మొదలిడెను.

శుభముహూర్తమున దుర్గనిర్మాణమునకు శంకుస్థాపనజరిగెను. పునాదులు ఏర్పడినవి. గోడలు లేచినవి. కాని బురుజుపని తుద ముట్టలేదు. పూర్తి కాకుండగనే అది నేలకూలెను. అంతమాత్రమున కాటారెడ్డి నిరుత్సాహపడలేదు. తిరిగి పనిప్రారంభముచేసెను. కాని ఈ మాఱుకూడ బురుజు నిలబడలేదు. రెడ్డికి అనుమానముతోచెను. అయినను మఱల నాతఁడు బురుజుపని రెట్టింపు కట్టుదిట్టములతోఁ జేయించెను. కాని కార్యము లేక పోయినది.

తిరిగి బురుజు నేలమట్టమయ్యెను. ఇట్లు నాలుగైదుసారులు జరిగెను. అందుతో కాటారెడ్డికి అనంతమగు విచారముకలిగెను. తుది ప్రయత్నముగా ఆతఁడు మఱల బురుజు నిర్మించుటకు దొరకొనెను. అప్పుడచ్చట పని చేయువారిలో నొక కాఁపువానికి శివమెత్తెను. ఆవేశము కనుపించిన పురుషుఁడు కాటారెడ్డితో నిట్లు పలికెను.

"నే నొక మహాశక్తిని. చిరకాలముగా నీ ప్రదేశమును ఆశ్రయిం

చుకొనియున్నాను. బలియిచ్చి నన్ను తృప్తిపఱచిగాని మీరిచ్చట కోట గట్టలేరు. మీరు నాకు బలి ఈయనికారణమున బురుజును కూలద్రోయుచున్నాను. నాకు సాధారణమైన బలితో సంతృప్తికల్గదు. ఒక బాలెంతను ఆమె కనిన బిడ్డతోఁగూడ నాకు బలినీయవలెను. ఇచ్చెదరా బురుజు నిలుచును. ఈయరా మీ రీజన్మమున నిచ్చట కోట నిర్మింపఁజాలరు.''

కాటారెడ్డి యిది వినెను. దీర్ఘవిచారపరీతమైన అతని మనము ఆలోచనాధీనమయ్యెను. కోట నిలబడుటకని ఏస్త్రీవచ్చి శిశుసహితముగ బలివోవును? ప్రాణములపై తీపిని చంపుకొనుటకు కొందఱు సాహసింప వచ్చును. కాని కడుపార గన్న బిడ్డను మృత్యుముఖమున చేతులార నర్పించుటకు ఏ తల్లిప్రాణ మంగీకరించును? ఇంత ప్రయత్నము చేసి దుర్గనిర్మాణమును పూర్తి చేయక పోయి అతఁడే మొగముతోఁ దిరిగి తన యేలికయగు ప్రౌఢదేవరాయలను దర్శింపఁగలఁడు? ఎన్నివిధముల చింతించినను అతనికి ఆలోచన తెగలేదు.

కోటలోనున్న మహాశక్తి శిశుసహితముగ నొక బాలెంతరాలిని బలిగోరుచున్న వార్త జలత్తైలబిందువై రాయచూరు గ్రామమున మారుమూలలయందుఁ గూడ వ్యాపించెను. తుద కాసంగతి పురుటి మంచముపై నున్న తెలగవారిచిన్నది సంగమ్మచెవికిఁగూడఁ జేరెను. ఆమె అప్పటికి మూఁడుదినములకుఁ బూర్వము ప్రసవించియున్నది. కోట కట్టుటకు కాటారెడ్డి చేయుచున్న సకలప్రయత్నములును బూడిదలోఁ బోసిన పన్నీరగుచుండుట ఆమె గమనించెను. కోటతీరినచో నది ప్రజలకు మిక్కిలి ఉపకారిగా నుండగలదని ఆమె నిజ మూరసెను.

''చావు ఎప్పటికైన తప్పనిదే. జరాభారమున క్రుంగి, రోగములచే క్రమంది జీవితమును నిరర్థకముగా తుద ముట్టించుటకంటె ప్రజాభ్యుదయమునకై ఇప్పట్టున మరణమును వరించుట ఉత్తమము; కీర్తిదాయకము'' అని త్యాగమహితము, పరార్థప్రవణము అగు బుద్ధిగల సంగమ్మకుఁ దోచెను. తన డొక్కలోదూరి పరుండియుండి అప్పుడప్పుడే నేత్రములను విప్పి లోకమును గాంచుచున్న ఆ నెత్తురుకందు నొక్కసారి యామె తిలకించెను. ''ఈప్రజోపయోగకార్యములో నా చిట్టిబిడ్డకూడఁ బాల్గొనుగాక! పసరుమొగ్గకు దేవతాపీఠమున స్థానము లభించునుగాక!'' అని ఆమె నిష్కర్ష చేసికొనెను.

పొత్తులలో పాపనిడుకొని ఆ పచ్చిబాలెంతరాలు కోటచెంతకుఁ బోయెను. నిజపుత్రసహితముగ నామె నిస్త్రింశభావముతో, నిరాకులాత్మతో, నిశ్చలబుద్ధితో, నిర్వికారాకారముతోఁ బునాది గోతిలో దుమికెను.

అప్పట్టున నామె సంసారభ్రమ మించుకేనియుఁ బొందలేదు; వైక్లబ్యము వీసమంతయున నొందలేదు. పుత్రునిపట్లగల ప్రేమస్నేహవాత్సల్యసంపద నంతను దిగఁద్రావినది.

ఆసన్నమైన సప్రాణసమాధిసంగతి నెఱుఁగక తన పొత్తిళ్ళలోనుండి పాలబుగ్గలను లేతనవ్వుతో రాణింపఁజేయుచున్న చిఱుతవాని చిన్నారివదనమును జూచిన పిమ్మటనైన ఆమె కన్నులు చెమ్మగిల్లలేదు; చెక్కుటద్దములు వికాసము దప్పలేదు.

కండక, గాజువాఱక ఆమెకళ్లు, చెక్కిళ్లు యథాపూర్వముగ మధురమందహాసనిష్యందముతో నొప్పారుచుండెను.

అప్పుడు కూలివాండ్రు చుఱుకుగా ఆపునాదిలో ఆమాతాశిశువుల పైన ఇటికలుపేర్చి గోడలు కట్టిరి. గోడలులేచెను. బురుజు తీరిచెక్కు చెదరక నిలచెను. క్రమముగా మిగిలిన బురుజుల నిర్మాణముకూడఁ బూర్తియయ్యెను; దుర్గము సర్వాంగపరిపూర్ణశోభతో విలసిల్లెను.

సంగమ్మచేసిన అపూర్వత్యాగము దేనికి రూపసిద్ధి కల్పించినదో ఆరాయచూరుదుర్గమునుండి ప్రభుత్వము సాగించి కాటారెడ్డి కాటభూనరేంద్రుఁడని ప్రసిద్ధి చెందెను.

తనఅభ్యుదయమునకు సంగమ్మ త్యాగము మూలదుంప యన్న సంగతి రెడ్డి ప్రాణము లున్నంతవఱకు విస్మరింపలేదు.

మహాత్యాగిని సంగమ్మ శిశుసహితముగా బలిపోయినిలిపిన బురుజు యిప్పటికిని ఆమెపేరిట 'శాలెంత సంగమ్మకోట' అని వ్యవహరింపఁ బడుచున్నది. త్యాగధనుల పవిత్రనామములు అక్షరమను సూత్రము నీ విషయము ప్రతిపాదించుచున్నది.

సంగమ్మ త్యాగము అతిలోకమైనది. పరోపకారార్థము ప్రాణత్యాగ మొనర్చిన రమణీమణులు ఇతిహాసప్రపంచమునఁ బలువురు గలరు. కాని శిశుసహితముగ బలిపోయినవారు మిక్కిలి తక్కువ. తల్లికిఁ దన ప్రాణముమీఁద కంటె తన బిడ్డ ప్రాణముమీఁద మమకారము హెచ్చు. అట్లుండుట ప్రకృతిసిద్ధము. లోకసహజమైన అట్టి మమకారమును గూడ తెగగోసి లోకోపకారార్థము శిశుసహితముగ ప్రాణములను విడిచిన తెనుఁగుపడఁతి సంగమ్మ త్యాగబుద్ధి కొలఁదులువెట్టఁదరము కానిది. ఆమె సాహసము శతథా శ్లాఘింపవలసినది.

—'ఆంధ్ర రమణీమణుల' నుండి.

ప్రణయతత్వము

అఖిలజగములు ప్రణయమయంబు సకల
జంతుజాలంబు ప్రేమపాశంబుచేతఁ
గట్టబడియుండె; నీధరగల్గు జనులు
ప్రేమతత్వంబు తెలియని వెఱ్ఱివారు!
కంటికిని ఱెప్పవోలె లోకములనెల్లఁ
గాచి రక్షించునట్టి లోకైకనాథు
భక్తి సేవించుటే యగుఁ బ్రణయమనగ!
తనదు జన్మకారణులగు తల్లిదండ్రు
లందు మనుజుల కుండెడి యప్రతిహత
మగు కృతజ్ఞతయే ప్రేమ యవనియందు!
సతికి పతియెడ సతిపైనఁ బతికిగల్గు
గాఢ యనురాగమే ప్రేమగా దెలియుడి!
ఛాత్రతతియెడ గురుని వాత్సల్యతయును
గురువునెడ పూజ్యతయు శిష్యవరులు భక్తి
మెలఁగుటయు ప్రేమయేయంచు దెలియవలయు!
సర్వలోకాల సృష్టి విశాలదృష్టి
గాంచి దయబూను యోగిపుంగవునికిఁగల
సర్వమానవసోదర సమతప్రేమ!

ఒప్పుగా ప్రాణమిత్రుల కొకరిపైన
నొకరికుండెడి దృఢమైత్రియే ప్రణయము!
మనల గన్నట్టి శ్రీయాంధ్రమాత యెడల
గౌరవము, దేశసేవ, త్యాగములు ప్రేమ!
ప్రభువునెడఁ బాలితులకును ప్రజల యెడల
ప్రభువునకునుండునట్టి పరస్పరాను
రాగవిశ్వాసభక్తులే ప్రణయమగును!
జగతిలో నరులు పెంచెడి జంతుతతికి
వాని యజమానులయెడ నవ్యాజప్రేమ
భక్తివిశ్వాసములు జూడఁ బ్రణయజములు!
రవియు జంద్రుఁడు రిక్కలు రాత్రిఁబగలు
జేయు నీవిధ మెల్ల యోచించి జూడ
ప్రణయ ప్రతిబింబ మని జనుల్ పలుకునట్టి
వారిజాక్షుఁడు చూపు యవ్యాజకరుణ!
ఫలరహితమైన రాగమే ప్రణయమగును!
సేవయే యుత్తమప్రేమచిహ్న మరయ!
ప్రేమమయుఁ డీశ్వరుఁడు సృష్టిప్రేమమయము!
దైవమేప్రేమ ప్రేమయే దైవ మరయ!

—మల్యాల వేంకటశివరామకృష్ణ

భగ్నదర్పణం

రచయిత:
సి. యస్. శర్మ.

చుక్కల్ని చూస్తూ డాబామీద పడుక్కున్నాను.

నాలుగువైపులనుంచీ నల్లని మేఘాలు వచ్చి నక్షత్రాల్ని ఆర్పేశాయి.

పెద్దగాలి వీచింది.

బొటబొటమని చినుకులు పడ్డాయి.

గబగబా క్రిందికి దిగి, తలుపు వేశాను.

గాలి గదిలోకి చొరబడి దీపాన్నార్పేసింది.

చీకట్లో తడువుకుంటూ నిప్పుపెట్టెని వెదికి దీపాన్ని వెలిగించాను.

నిద్రరాదు.

ఏదేనా చదువుకుందామంటే కళ్ళునొప్పులు!

తలుపులన్నీ వేసి మంచంమీద కూర్చుని నా 'ఫోటో' నిచూస్తూ, ఏదో ఆలోచిస్తున్నాను.

ఆ నిర్మల ముఖవర్చస్సు,-కళ్ళల్లో ఆకళ,—ఎల్లా వెలిగేవాణ్ని!

ఇప్పుడల్లా వున్నానా?

నా నవ్వుల్ని నేను చూడాలని బుద్ధి పుట్టింది.

అద్దంకోసానికి ఇల్లంతా గాలించాను.

ధూళితో నిండిన భగ్నదర్పణం అగుపించింది.

అద్దాన్ని బాగా తుడిచి, దీపాన్ని పెద్దదిచేసి నాప్రతిబింబాన్ని చూస్తోన్నాను.

ఏమిటిది?

నాదేనా ఆప్రతిబింబం!

ఉహూ! నేను నమ్మను!

ఆ కళ్ళల్లో నవ్వులు వినిపించటంలేదేం!

ఆ లోతుకు పోయిన నేత్రాలు, మాసినగడ్డం, నెరసిన బిరుసయిపోయిన జుత్తు!...ఛీ! నావికావు-ఏదో పశువువి!

కళ్ళు పెద్దవిగచేసి చూశాను.

మరీ బీభత్సంగవుంది రూపు.

నా ఫోటోని చూశాను

ఎంత ప్రశాంతంగవుంది ఆ చిత్రం!

అద్దం మంచిది కాదేమో!

నాస్నేహితులందరూ నన్ను చూసి నవ్వడంలేదే! పూర్వంలాగే గౌరవిస్తున్నారే మరి!

ఇంత కుళ్ళుకంపు కొడ్తున్న-పశువునిలోకం ఎల్లా భరిస్తోంది!

అద్దాన్ని స్పిరిట్‌తో కడిగాను.

మరీ అసహ్యం కలిగిందిచూస్తే!

* * *

అద్దాల మేడలో మేం విహరిస్తున్నప్పుడు కొనుక్కున్నాం ఆ అద్దాన్ని.

ఆ అద్దంలో మా ప్రతిబింబాల్ని చూసి మురిసి పొయ్యేవాళ్ళం.

కాలం మళ్ళింది.

కర్మం కుళ్ళింది.

వాళ్ళందరూ గతించారు.

వాళ్ళతోపాటు నాభాగ్యం బుగ్గయిపోయింది.

మిగిలిపోయాను ఒక్కణ్ణీ!—రాంబందులాగ!

ఈ పిశాచరూపాన్ని చూసి మృత్యువుకూడ భయపడిందేమో! దూరమౌతోంది—ఎప్పటికీ కౌగిలించుకోదు!!

ప్రతిబింబాన్ని చూస్తున్నకొద్దీ, నా నరాల్లో రక్తం ఉడుకెత్తి, రౌద్రాన్ని రేకెత్తించింది.

ముక్క ముక్కలుగ చేశాను అద్దాన్ని.

ఆకాశాన ఉరుములు ప్రతిధ్వనించాయి.

పది ముక్కల్లోనూ ప్రతి బింబించింది పాడురూపు—దెయ్యం నవ్వు నవ్వుతూ!

ఉద్రిక్తుణ్ణయిపోయి పెద్ద కేక వేశాను.

కృంగిపోయింది గుండె.

స్పృహతప్పి పడిపోయాను.

దాసీ తలుపుకొడ్తే తెలివి వచ్చింది ఏడుగంటలకి.

నాచుట్టూ పడివున్న అద్దం ముక్కల్నీ, మండిపోతున్న దీపాన్నీ, మసెక్కిన దీపంచిమ్నీని, చూసి ఆశ్చర్యపోయింది.

భయకంపితుణ్ణయి

పారిపొయ్యానక్కణ్ణుంచి!

పిరికివాణ్ణా?

ప్రేమికుణ్ణా? ఏమో!

రేడియో ప్రభావం

గాలి కూతలు

'ఇక మనం మనదేశంలోని రేడియో నిలయముల కార్యకలాపం గూర్చి పరికించవలసి యున్నది.'

రచయిత:

సాకాశం వేమయ్య

ఇటీవలనే B B C అనగా బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌కి 18 ఏళ్ళు నిండి ప్రగల్భ అయింది. అంతః పూర్వమే అమెరికాలో రేడియో పెనవేసికొని ఉండింది. బ్రిటన్‌లో రేడియో గబాగబా వ్యాపించింది. ఈరోజున ఒక కోటి రేడియోసెట్లు ఇంగ్లండులో ఉన్నాయి. అన్ని దేశాలలోని రేడియో సంస్థలకు 1922 లగాయతు B B C దారిచూపుతూ వచ్చింది.

* * *

ఎవరూ కననిది, విననిది ఊహించనిది ఈ రేడియో. ఇది నేలమీద నిలచేప్పటికి ఒక కొత్త చైతన్యం వెలసినట్లయింది. జనగణపు బుద్ధిమత్త యొక్క విస్తారానికి ఇది అసదృశంగా తోడ్పడసాగింది వన్నె చిన్నెలతో చిలవలు పలవలుగా ప్రతి విషయంలోను కొత్తదార్లు తీస్తూ ఎల్లరకూ కర్ణపేయంగా వినుకలికి కారణమైంది.

* * *

మనదేశంలో రేడియో ఆరంభించి దరిదాపుగా పదియేళ్లు అవుతున్నది. మన రాజధానిలో ఈ బొమ్మదేవతకి మొన్న జూన్‌లో రెండో పుట్టినరోజు సీళ్ళుపోశారు. ఇదే రాజధానిలో తిరుచునాపల్లిలో రేడియో నివేశనం వెలసి యేడాదిపైగానే అయింది. ఢిల్లీ, (బెంగాల్) కలకత్తా, ఢక్కా; చెన్నపట్నం, తిరుచునాపల్లి, బొంబాయి, పెషావర్, లాహోర్, లక్నో నగరాలలో ఆయా ప్రాంతాలకు రేడియో నివేశనాలు వెలసి ఉన్నవి. ముఖ్యమైన దేశభాషలన్నీ రేడియోలో ఉపయోగం అవుతూ ఉన్నవి-

ఈరోజున ఈదేశంలో లక్షకి పైగా రేడియోసెట్లు ఉన్నాయి. ఆంధ్రదేశంలో రెండు వేలుగూడా లేవు. తమిళనాడులో వేలకొద్దీ ఉన్నవి.

పైన పేర్కొన్న రేడియో నిలయాలన్నీ ఈదేశంలోని బ్రిటిష్ ప్రభుత్వంచే ప్రతిష్ఠించబడి ఉన్నవని మనం గమనించవలె.

అన్నట్లు యివిగాక మైసూరులోను హైదరాబాదులోను ఆ సంస్థాన ప్రభుత్వములు రేడియో నిలయములు యేర్పాటుచేసి యున్నవి.

* * *

మనం విమర్శ అనేది కేవలంగా చేసి ప్రయోజనం ఉండదు. మన దేశంలో మనమే పంజరంలోని చిలుకలాగా అస్వతంత్రులంగా పరదాసులంగా ఉంటున్నామనే సంగతి మరచిపోకూడదు. ప్రజకి సంబంధించిన ప్రతీ విషయంలోను ఈ పరాధీనతయొక్క కారు నలుపు నీడ కనబడుతూ ఉంటుంది. రేడియో ఇందుకు ప్రబలమైన తార్కాణం.

* * *

మన మనస్సు దాస్యవాసనలను పాత్తుకుంటూ ఉన్నంతకాలం మనకి అభ్యుదయమూ ఉండదు, అభివర్ధనమూ ఉండదు.

* * *

ఈ 'రేడియో ప్రోగ్రామ్'లలో సంగీతం హెచ్చుగాఉండి ప్రసంగాలు, నాటికలు, కథలు మున్నగునవి తక్కువగా ఉంటున్నవి. రేడియో ముఖ్యంగా వినోదార్థమే

[మిగతా ౧౦౦-వ పేజీలో.

నిఘంటువుల్లో దొరకని విశేషార్థాలు : 3.

రాయబారాలు

[వినోదవ్యాసం]

'కనకనే, మహాత్ముడు రాయబారి మాత్రమే కాదు– నిశాగ్సయిన జ్యోతిష్కుడు అని అన్నాను.'

రచయిత :

'శ్రీహరి'

పలకడానికి తేలికేగాని, పని సాగించటానికి మాత్రం భారమైంది 'రాయబారం.' భారమంటే కొస్తా కూస్తా కాదు. అత్యంత భారమైన పని రాయబారం సాగించటం.

... ...

'రాయబారాలు' మన స్త్రీ వాఙ్మయంలో—'అనాదృతమైన' స్త్రీవాఙ్మయంలో— చాలాచాలా అగపిస్తాయి: కోవెల రాయబారం, చిలుక రాయబారం... ఇట్లాంటివెన్నో. అయితే— స్త్రీజాతినే లక్ష్యం చెయ్యని భారతీయులు స్త్రీవాఙ్మయాన్ని తెరిచి అందులోని 'రాయబారాల్ని' అంటుకుంటారా ?

... ...

పైె చెప్పిన రాయబారాల్లో రాయబారి పని యేమిటీ అంటే: విరహావేదనలో వివశులైవున్న నాయికా నాయకులను సమాగమం చేయటం. అనగా ప్రణయజీవులకి ప్రేమభిక్ష పెట్టడమన్న మాట. వారి జీవితాశయాలు యావత్తూ 'రాయబారి' మీదనే ఆధారపడి వుంటాయి. పండు వెన్నెలలు తూర్పులేని చల్లందనమూ, పూపొదరిండ్లు ప్రసాదింపలేని అవిరతానందమూ— ఇటువంటి మహత్తర వరాలు 'రాయబారి' హస్తాల్లో ఇమిడివుంటాయి.

... ...

మన కావ్యకథలూ, పురాణకథలూ ఇటువంటి 'రాయబారాల'తో కాని అడుగు ముందుకు వెయ్యవు. మచ్చుకి కావలిస్తే— నల దమయంతుల మధ్యని జరిగిన హంస రాయబారం చెప్పుకోవచ్చు.

ఈ హంస రాయబారం పూర్తి అయిందో లేదో, అంతలోనే నలమహారాజు దమయంతికోసం దేవతల తరఫున రాయబారం జరపాల్సిన అవసరం కలిగింది. అయితే,- ఇది పరీక్షార్థం వుద్దేశింపబడిన రాయబారమే గనక, దమయంతి దేవతలకు దణ్ణంపెట్టడంతో ఆమెకు 'అసలు' రాయబారం అనుకూలంగానే పర్యవసితమైంది.

... ...

దీనికి తుల్యమయిందే రుక్మిణీ కృష్ణుల నడుమను నడిచిన 'బాపన రాయబారం.' ఆమె నియమించిన బ్రాహ్మడు రాయబారాన్ని మోసుకువెళ్ళింది మొదలుకుని తిరుగా కంటబడి మంచిమాట చెప్పేవరకూ ఒకటే తహతహా! ఒకటే తొట్రుపాటు!! - నిజంగా ఆమె అప్పటి అవస్థను మహాబాగా వర్ణించాడుకదూ, మహానుభావుడు పోతన్న!—

... ...

పౌరాణిక రాయబారాల్లో ముఖ్యమైనవి మరికొన్ని— కృష్ణరాయబారం, సంజయ రాయబారమున్నూ. ఇందులో కృష్ణరాయబారమంటే 'గిల్లి కజ్జా తెచ్చుకోవడ'మనే నానుడి యేర్పడిపోయింది. మహాభారత యుద్ధానికి కృష్ణరాయబారమే పునాది రాయి.

... ...

అనాటి శ్రీకృష్ణునితో ఈనాడు మన గాంధిమహాత్ముణ్ణి పోల్చుకుంటున్నాము. అంచేత, కృష్ణరాయబారంలాగా గాంధీ రాయబారంకూడా నిరర్థకంగానూ, నిప్పు రగిల్చేదిగనూ ఉండటం సహజమే. కానైతే,- కృష్ణుని పలుకులూ, చేతలూ పైకి ఎంతో యుక్తియుక్తంగా

•తోచేవి. అట్లానే గాంధిమహాత్ముని విషయంలోనున్నూ.

... ...

నూటవొక్కసార్లయినాసరే రాజప్రతినిధితో రాయబారం సల్పటానికి సంసిద్ధంగా వున్నానన్నాడు మహాత్ముడు. రాచకీయ రాయబారాలు సాధారణంగా రాణకు రావనే సూత్రాన్ని ప్రత్యక్షంగా రూఢిపరిచాడు కూడాను.

... ...

కీ తెరిగిన కోమటిబిడ్డ 'కరంచంద'. ఇటీవలి 'గాంధీ—లిన్‌లిత్‌గో' రాయబారం ఫలోదయం కాదని ముందే చెప్పి బయల్దేరాడు మహాత్ముడు. ఇందువల్ల ఆయన రాయబారి మాత్రమే గాక జ్యోతిష్కుడు కూడానని తోస్తుంది.

... ...

గాంధిగారు నిజంగా జ్యోతిష్కుడే. ఏమంటే: ఆయన చెయ్యబోయేదే పైకి చెబుతాడు, చెప్పినంతా చేసి తీరతాడు. కనకనే, మహాత్ముడు రాయబారి మాత్రమే కాగ - నికార్సయిన జ్యోతిష్కుడు అని అన్నాను.

... ...

ఇప్పటి మహాయుద్ధంలో అనేక రాయబారాలు జరిగివున్నాయి. జరుగుతున్నాయి. ఇంకా ఎన్నో జరగనున్నాయి. వీటన్నిటిలోనూ మరవరానిదీ, చారిత్రక ప్రసిద్ధమయిందీ 'హిట్లర్ - చేంబర్లేన్' రాయపారం. చేంబర్లేను రాయబారానికి చంకను ఛత్రం దోపుకొని వెళ్ళడం తరతరాలా ఉండిపోయే ఒక హాస్యకథగా చిత్రితమైపోయింది.

... ...

ఆ మధ్యని మనపట్టాభి 'సింహళ రాయబారా'నికి వెళ్ళబోతారని ఆకసపక్షి చెప్పడం మొదలెట్టింది. తెలుగువాడికిది తలకు తగదని చెప్పి, విమానం వేసుకుని నెహ్రూపాండితుడు నెట్టుకువెళ్లాడు. ప్రెసిడేంటుపదవి దాటిపోయిన పట్టాభికి సింహళరాయబారంకూడా వూడిపోయింది.

... ...

ఈ రాయబారాలన్నీ చూడగా, దీన్లో ఏదో వుందని కాబోలు, ఆధునిక కవికుమారులకి నోరూరడం ఆరంభించింది. శ్రీ త్రిపురాన వేంకటసూర్యప్రసాదరావు దొరవారు 'మొయిల్ రాయబారం' పేరుతో 'మేఘసందేశాన్ని' తెనిగించి తెలుగు కైతకి కొత్తతెన్నులు చూపడంలో బోణీ చేశారు.

... ...

దొరవారు మదరాసు విచ్చేసి 'మొయిల్ రాయబారం' కావ్యపఠనంతో కల్గజేసిన కైపు ఇంకా వదలనే లేదు— అంతలోనే వినుకొండలోని వీసు మిగిలిన జాషువా కవిగారు 'గబ్బిలపు రాయబారం' చేతపట్టుకొని గుభీమని మద్రాసు చక్కా వచ్చారు.

... ...

ఈ రెండు 'రాయబారాలూ'-మద్రాసు బస్తీ నలుమూలలా కావ్యగోష్ఠి కమనీయంగా సాగిపోయింది. చెన్నపురి ఆంధ్రుల్లో ఈ 'రాయబారాలు' గొప్ప చైతన్యాన్ని కల్గించాయి.

... ...

ఈ రెండు రాయబారాలూ మద్రాసుకు ఒకేసారి రవాణా కావడంలో

మరో చిత్రంకూడా మనం గమనించవచ్చు: చెన్నపురి ఆంధ్రసభలో 'గబ్బిల రాయబారం' కావ్యపఠనం జరిగినప్పట్లో 'మెయిల్ రాయబార' కర్తలు ఆసభకు అధ్యక్షత వహించారు. 'గబ్బిలరాయబారా'న్ని అమితంగా మెచ్చుకున్నారుకూడా. అందుచేత, ఈ రెండు రాయబారాలకూ మధ్యని స్పర్థలుగాని, ద్వేషాలుగాని లేవని స్పష్టపడిపోయింది.

... ...

పై 'రాయబార' కావ్యాలు చెన్నపురిలో పఠింపబడ్డంతోనే కొందరు కవికుమారులు ఉత్సాహం పట్టలేక కథలు రాశారు. 'మెయిల్ రాయబారాని'కి అప్పీలా అన్నట్టు, అక్టోబరు 9-వ తారీఖున ఆంధ్ర వారపత్రిక 'మెయిల్ రాయబారం' కథానికను ప్రకటించింది.

... ...

'మెయిల్ రాయబారం' కథ 'మెయిల్ రాయబార' కావ్యంమీద సరాసరి సూటిగా దెబ్బేనని అంశాల్నిబట్టి అవగాహన అవుతున్నప్పటికి 'లా' ప్రకారం కథకుని చెరువకైనా వెళ్ళడానికి వీల్లేకొచ్చింది. ఏమీ అంటే—'ఈ మెయిల్ రాయబారానికీ, జగత్తులోని మరి ఏ యితర రాయబారానికీ ఎట్టి సంబంధమూ లేదూ' అని ముందు జాగ్రత్తతో స్పష్టంగా లిఖితమైవుంది మొదట్లోనే. కనక, కనీసం శీర్షిక యినా మేనమామ పోలికకలది అనే నేరం ఆరోపించుదామంటే న్యాయశాస్త్రం మనపక్షాన పలకదుగా!

... ...

డి. వి. కృష్ణారావుగారు రచించిన 'రాయబారం' వేగుజుక్క గ్రంథమాలికలో వెలసి, ఆంధ్రమహాజనుల ఆదరణకు పాత్రమయింది. ఇది కొన్ని విశ్వవిద్యాలయ పరీక్షలకూడా నియమితమై విద్యార్థుల కరకమలాలను అలంకరించింది. అంటే రాయబారం విద్యార్థుల సముఖానికి వచ్చిందన్నమాట. అందుతో 'సముఖానికివచ్చి రాయబారమా' అను తెనుగుసామెత నిరర్థకమైపోయింది.

... ...

ఈ రాయబారాలవ్యాసంలో 'సముఖానికివచ్చి రాయబారమా' అనే తెనుగుసామెతను నిరర్థకం చేసినందుకే కాకుండా ఇంత వ్యాసం వ్రాసీ అందులో సుప్రసిద్ధమైన తడిక రాయబారాన్ని తడవనందుకు కూడా ఆంధ్రమహాశయులు నామీద కోపగించవచ్చును. కోపగించివా తడిక రాయబారాన్ని తడవవలసిన అవసరం, అవకాశం నాకు లేదని వినయపూర్వకంగా మనవిచేస్తున్నాను.

... ...

తెలుగు బ్రాహ్మల్లో 'ఏ ఎండకు ఆ గొడుగు యెత్తుతూ' అటు వైదీకమూ, ఇటు నియోగమూ వెలబెట్టే ప్రథమశాఖీయుల్లో రాయబారపువార నే ఇంటిపేరుగలవారున్నారు. వారు వెనక ఏమి రాయబారాలు చేశారో కాని ఇప్పుడు పెళ్ళిళ్ళ రాయబారాలు చేయడానికైనా పనికిరాకుండా వున్నారు.

... ...

ఆ రాయబారపువారు నేడు పెళ్ళిళ్ళ రాయబారాలకికూడా పనికిరాకుండా వున్నారనే విషయంతో ఈరాయబారవ్యాసం ముగించడానికి నేను ఎంతమాత్రమూ సందేహించడంలేదు.

రేడియో ప్రభావం

[౯౭-వ పేజీ తరువాయి]

నని తలచే పనిలేని పనికిమాలినవారు లేకపోలేదు. ఎందుకు అంటే వారికి కాలం వెళ్ళబుచ్చడంకష్టం. అన్నం వడ్డన ఒకనిమిషం ఆలస్యం కాకూడదు వారికి. ఆలస్యమైతేనే ఎప్పుడో వాడికి కలి, కలి, ఆకలి అంటే ఏమిటో తెలియదు.

* * *

అన్ని దేశాల్లోను రేడియోను జనాంబగా, జ్ఞానాంబగా, జ్ఞానప్రసూనాంబగా చూస్తూ ఉన్నారు.

* * *

అయితే సర్వత్రా రాజకీయ తంత్రజ్ఞుల చేతుల్లోఉండి యీ నవాంబుజోజ్జ్వలకరాంబ నలిగిపోవటంలేదు. స్వతంత్ర దేశాల్లో యీ 'అమ్మతల్లి' యొక్క ప్రభావ ప్రభాతం అద్భుతంగా ఉన్నది.

* * *

ఇక మనం మనదేశంలోని రేడియో నిలయముల కార్యకలాపం గూర్చి పరికించవలసియున్నది.

అనంతకోటినక్షత్రాలు

[౯౨-వ పేజీ తరువాయి]

వైతే, రసవత్తర కథనణ్ని చేయాలి?-

అవును. దాంతోటి,- యీపత్రికల వల్ల నాలుగు డబ్బులు రాకపోయినా ?- యేంటో మానవప్రకృతిగదూ! అందరిలా కాకుండా, నవ్య- సాహిత్య సువర్ణ సైకత వేదికల్లో- తనకీర్తి జ్యోతులను ప్రసరించకపోడు !

లేకపోతే—

ఆంధ్రోద్యమాన్ని బాగా నడిపే- 'మడమత్రిప్పని ఆంధ్రవీరున్ని' గానన్నా!—

రైటు. నిజంగా—ఆంధ్రరాష్ట్రోద్యమము- అధోగతిగ నున్న యీస్థితిలో, యువకవర్గాని కంతటికీ- చైతన్యాన్ని కల్పిస్తూ...

'ఆంధ్ర తేజమ్మూర్తీభవింపా-
అద్భుతగ లెడి అయ్యరులడ లెత్తి వేగా
దేశ దేశాలకూ ఒక్క లేపరుగు'
చేయడూ?- కాకపోతే,...

—మృదులమానవ హృదయాలను నిష్కారుణంగా- కత్తిమొనతో కెలికి, చిత్రవధచేసే- వైద్యున్నిగా చేస్తే?-..

యెండల్లో మాడి-తన మధురఫలాలను ప్రజలకు దానంచేసే, రసాలశాఖలా?... యింత ప్రాణదానం నలుగురికీ చేసి, తనూ- నాల్గురాళ్ళు సంపాదించుకొని, వృద్ధాప్యంలో మన్ములను పోషించి- పేరు ప్రతిష్టలు సంపాదించుకోకపోడు.

...ఆరని తృష్ణతో భ్రమించే వృద్ధిక్త మధువ్రతుడిలా?- యేమిటేమిటో ఒక్కొక్కటి నాముందర నృత్యంచేస్తూ రైలు బండిలా పరుగెత్తుతున్నాయి.

* * *

నరసరావుపేటలో దిగి యింటికి చేరుకున్నాను.

—నడవలో యెవరూ లేరు. లోపలకు వెళ్ళగానే- ఏదో మాట్లాడుతూ, నాభార్యతో- మా అత్తమ్మ మంచం మీద కూచొనివుంది.

నడికట్టూ—తలమీద ముసుగూ... చిక్కిపోయినదేహంతో- లేవబోయింది నాభార్య- తూలుతూ, సోలుతూ !

'కూచో అమ్మాయి' అని- మా అత్తమ్మ లేచి- స్టూలుబల్ల తెచ్చి నాకేసింది.- కూచున్నాను.

''టెలిగ్రాం యిచ్చినా రాలేదేం- నాయనా?- నీకోసం, యెంత మాచాం- పిల్లాడిని పారవేయబోతే తండ్రివచ్చి చూసుకుంటాడు అని అది బోరున యేడ్చిందికదా!'

నిశ్చేష్టుడనైపోయా!- సోలిపోయింది ప్రాణం-

'యింతకూ పిల్లాడిని చూచుకునే అదృష్టంలేదు.' అంటూ- దుఃఖించింది.

రైలు పరుగెత్తినట్లు గుండె- గుభేలుమంది.

—గొంతుక రాచుకుపోయి మాట పెగల్లా! కళ్ళల్లో కళ్ళుతిరిగి- కాలరును తడిపాయి.

'యింకా అదృష్టవంతుడివిలే!' అంటూ- అత్తగారు తన కూతురుకి విసనకర్రతో విసిరింది.

రాచుకుంటున్న గొంతుకతో '..యేం, అత్తమ్మా!' అన్నా—

'—చూసుకుంటూనికి కళ్ళుండొద్దూ!' అంది. యెక్కడో మాట్లాడినట్లు నాభార్య.

'అందరి భోజనాలయాయి...పది గంటలనుండి నొప్పులు ప్రారంభమైతే- మీ మామయ్యా, పుల్లయ్యా- డాక్టరుగారిని తీసుకొచ్చారు.

రాత్రంతా బాధపడి అయిదున్నరకు ప్రసవించిందమ్మాయి. పుట్టినప్పటినుంచీ. పిల్లాడికి యేడుపేలేదు. పిల్లాడికి యింజక్షనులు యిచ్చి వేడి తెప్పించి- కళ్ళు తెరిపించి- ముఖం కడుక్కొనేందుకు వెళ్ళారు డాక్టరుగారు.'

నాకు ఒక్కొక్కమాటా, వేయివేయిటన్నుల బరువును- హృదయంపై పెట్టినట్లయినై !—

'—తిరిగి డాక్టరుగారు వచ్చి చూసేసరికి చన్నీల్లకుండయి స్మృతి తప్పిపోయి పడుకొనివుంది అమ్మాయి.

—గాబరాతో రెండు యింజక్షనులు యిచ్చి- కస్తూరి తినిపించి, వేడి తెప్పించి అమ్మాయిని బ్రతికించారు. రెండు గంటలకల్లా పిల్లాడు చనిపోయాడు. నువ్వొచ్చి చూసుకుంటావని అమ్మాయి యేడ్పి- ఆపుచేయించిం దెంతోసేపు యేంలాభం.' అంటూ నిట్టూర్పు పుచ్చింది అత్తమ్మ.

—నాజ్యోతిచ్ఛాయను తిరిగి నూతన కళలతో ప్రకాశింపజేసి- నాజీవితాన్ని వివిక్త హిమవత్సాంద్రారణ్యముల్లోకి పోనియ్యకుండా- వెన్నెలలోని సుందర నందనోద్యానవనంగా మార్చినందుకు, హృదయంలో—డాక్టరుగారిని పూజించింది నామనస్సు !

* * *

వీధి అరుగుమీద వాల్చివున్న మంచంలో పండుకుంటూ,- అభాగ్యుని తలలోని అనంతవాంఛల్లాగు, అంతరించాయె- నా ఆలోచనలు అనుకున్నా !

చంద్రుడులేని ఆకాశంలో,— నా తలలోని వాంఛల్లాగు... అనంతకోటి నక్షత్రాలు!- అనంతకోటి....!

సుబ్బరామయ్య శాలువ

[౭౬-వ పేజీ తరువాయి]

నది. కడుపులో వికారంపుట్టింది రాఘవయ్యకు. ఆరంభమైంది గుడగుడ - కడిబిడ - ఒకేవాంతులు- మోడ, తలనొప్పి- విరేచనాలు- పడరానిబాధపడినాడు. తెల్లవారింది. ఇంటిలోనివారు, అల్లునికి నిండా జబ్బుగాఉన్నదని నెల్లూరికి, వేంకటరామయ్యకు జాబువ్రాసి పంపించేరు. ఆయన ఆయుత్తరంచూచుకొని తాను రావడమునకు బదులుగా జవాబు ఉత్తరం వ్రాసిపంపెను. చదువుకొనగా అందులో 'భయపడవలదు. శాలువాను మడిచి దూరముగా పెట్టవలెను. దానిని ఇంక ముట్టవద్దు- ఎవరికైనా యిచ్చినా మంచిదే! వాంతులు, విరేచనాలు నిలుచును. వేరే మందుమాకు లేవిన్ని అక్కరలేదు. తెలియవలెను' అని వ్రాయబడి యుండెను. కారణం తెలుపలేదు. అయినప్పటికి యేదో దీనిలో మోసం కలిగియుండాలెనని యెంచి రాఘవయ్య శాలువనుమడిచి దూలము మీదబెట్టి చెంపలు గొట్టుకొనెను. అట్లుచేయడంవల్ల కొంత తగ్గినదేగాని, వాంతిభేదులు పూర్తిగా నిలువలేదు. ఇంటిలోనివారు. 'పాడుశాలువ నొకదానిని తెచ్చావు. ఈ యవస్థయేర్పడింది. యిందులో యేదో రహస్యండుంది. తెలిసియుండే నీమామ నీకు దీనిచ్చాడు. లేకుంటే యింతమంచిదాని నిచ్చేవాడేనా? చాలుచాలు ఆయన బహుమానం. అది మనయింట్లోనే వుండకూడదు ఎవరికైన యివ్వడంగాని, ఆయనకే పంపెయ్యడంగాని చేయవలసింది' అని తొందఱపెట్టడానికి మొదలుపెట్టారు. రాఘవయ్యకున్నూ వాళ్లు చెప్పినట్లే తోచింది. కాని, మళ్ళీ మామకు పంపడం మఱియాదగా నుండదనీ, యెవళ్ళకయినా యోగ్యులుగా చూచియిస్తే పోతుందని నిశ్చయం చేసుకొన్నాడు.

ఆగ్రామంలో వేంకటరమణయ్య అనేవాడొకడుగలడు. అతఁడు సదాశివపూజయు, యితర దేవతార్చనయు చేయుచుండేవాడు. వేకువననే లేచి చన్నీళ్ళలో స్నానంచేసి మడుగు గట్టుకొని, శివపూజజపము చేయుచుండేవాడు. అది ధనుర్మాసం కాబట్టి ఆయన కొంచెముందుగానే నిద్రలేచి స్నానంచేసి కూర్చుండి శివపూజ గావించుచుండెను. ఆసమయంలో రాఘవయ్య శాలువా గొనిపోయి 'మీరు తపస్సుజేసుకొనేవారు. అర్హులు—అగుటచే యిది మీకు బహుమతిగా యివ్వడం మంచిదని యెంచి తెచ్చినాను' అని యెంచి శాలువా ఆయనకు కప్పి నమస్కారంచేసి యింటికి పోయెను. ఒట్టుబెట్టినట్లు రాఘవయ్యకు గలిగియుండిన బాధలన్నీ మాయమైనాయి.

వేంకటరమణయ్య తలపనితలంపుగా తనకంతటి మంచి శాలువ దొరికినందుకు సంతోషించి రాఘవయ్యకు తనయందు గలిగిన భక్తికై అతణ్ణి మెచ్చుకొనెను. నాటిరాత్రి కప్పుకొని పండుకొనెను. ఇంకా నిద్రపట్టెనో లేదో, అంతే! ఆరంభమైనాయి, విరేచనాలు, వాంతులు. కడుపులోమంట— వికారము— తాళలేక పోయాడు. కొంచెం బుద్ధిమంతుడు కనుక ఆలోచించా. 'ఏదో కారణం లేకపోతే యింతమంచి శాలువాను—వెలగలదానిని- ఆతను నాకు యివ్వడం యెందుకు? అడిగితినా? మోసముగా తోచుచున్నది' అని తటాలున దానినితీసి మడిచి దూరముగా బెట్టినాడు. ఉత్తరక్షణంలో అన్నిసంకటాలు నివర్తి. అరే! మోసంచేశాడు నిజంగా మోసమేరా — అనుకొన్నాడు. కాని రాఘవయ్యతో ఆప్రస్తాపం యేమిన్ని చేయలేదు. శాలువను తనయింట్లో నుంచరాదనీ యెవళ్ళకయినా యివ్వడం మంచిదనీ, ఆలోచించాడు ఆభక్తుడు.

ఆగ్రామానికి రెండుమైళ్ళ దూరములోగల మఱియొక పల్లెనుండి ప్రతిదినమున్నూ ఉపాదానమునకై యొక బ్రాహ్మణుడు వస్తూవుండేవాడు. ఆయనను సుబ్బన్న అంటారు. ఆబ్రాహ్మడు భిక్షానికి తన

యింటికి వచ్చినతోడనే వేంకట రమణయ్య శాలువా తెచ్చియిచ్చి 'ఇది నీకుయివ్వాలని బుద్ధిపుట్టింది. పిల్లలుగల పేదవాడివి- చలికాలం -హాయిగా కప్పుకో' అని ఆదరం తో చెప్పాడు.

దేవుడు తనకు మేలుచేశా డనీ, తాను బయలుదేరివచ్చిన కా లం మంచిదనీ, సంతోషించాడా చాదస్త్రపు సుబ్బన్న. అతడి కీమో సం తెలియదు,పాపము. శాలువను గొనిపోయినరాత్రి, తానున్ను, బిడ్డ లున్నూ కప్పుకొని పండుకొన్నారు, కుతూహలంతో- ఒకేసారి అంద రికి మొదలుపెట్టాయి వాంతులు- భేదులు- తెల్లవారేవరకు వారు పడినపాటు యింతింతగాదు. భగ వంతుడికి యెరుక, తెల్లవారినంతట సుబ్బన్నభార్య కొంచెం తెలివిగల దగుటచే యోచించింది. ఆమె కే దో సందేహంకలిగింది. మొగుణ్ణి పిలిచి 'ఈశాలువా తెచ్చినవేళ మంచిదికాదు. దీనివల్లనే యేర్ప డింది యీకష్టమంతా మనకు. ఏదో కారణంచేత యింత కరీదు గలదాని నిచ్చియుంటారుగాని లే కుంటె మనబోటివారి కిస్తారా? మ నచింపిరిగుడ్డలే మనకు చాలును. ఈశాలువను యెత్తుకొనిపోయి, ఎవరు యిచ్చినారో వారికేయిచ్చి రండి'—అని తొందరపెట్టగా, సు బ్బన్న కొనిపోయి, వెంకటరమణ య్య యింట్లో లేనితరుణంలో యె వరికిన్ని తెలియకుండా వారియింటి దూలముపైని బెట్టిపోయెను.

ఇంతలో వెంకటరమణయ్య ఇం టికివచ్చాడు.

వెంకటరమణయ్య యింట్లో ప్రవేశించాడో లేదో వికారం— విరేచనాలు-- ఆరంభం అయినా యి. సాయంత్రంవరకు అల్లాడినా డు. కారణంతోచలేదు. చీకటిపడి నది. 'ఈరాత్రి యెట్లాగడుస్తుంది రా భగవంతుడా' అనుకొంటూ దిగులుపడ్డాడు. ఆలోచించాడు కొంచెముసేపు ఆపాడుశాలువా మళ్ళీ వచ్చియుంటుందేమోయని మెల్లగాలేచి నాలుగుతట్లా వెదకి నాడు. కనుపడింది శాలువా దూ లముమీద. అరే చచ్చానే, దీని కేస్నాకొయ్యా. వచ్చిందే మళ్ళీ యిది యింటిలోకి ? ఏమిచేసేది? 'ఓరి సుబ్బన్నా! నాకు తెలియకుం డానే యెంతపని చేశావురా!' అం టూ ఊళ్లో అందరు నిద్రపొయ్యే దాకను యెట్లానో గడిపినాడు. ముందులాగు విరేచనాలు వాంతు లుమాత్రమేగాక యిపుడు శాలువ సొంతగాని రూపంకూడా కనపడ్డా నికి మొదలుపెట్టినది. సుబ్బరామ య్య నాశాలువా యెందుకు తెచ్చి పెట్టుకున్నావు? నీయబ్బసొమ్మనుకు న్నావా? నిన్ను చంపేస్తా' అనే మాటలు వినడమూ, ఈతట్టుకు ఆ తట్టుకూ యెదటతిరగడమూ వెం కటరమణయ్యకు, ఎక్కువ భయం కలిగింది. శాలువా యెత్తుకొనిపో యి తనకు యిచ్చిన రాఘవయ్య యింట్లో పెట్టాలె ననుకొన్నాడు. దాన్నిచుట్టి సంకలోపెట్టుకొని వారి వాకిటికిపోయాడు. తలుపు మూసిఉన్నది. లోపల అందరు మంచి నిద్రలో గుఱకలు పెడుతూ వున్నారు. ఆసమయంతో వాకిటి యరుగుపై కెక్కి మూరుసందులో నుండి శాలువాగోడపైగా లోప లికి చొప్పించి, దేవుడికి దండము బెట్టుకొని తనయిల్లు చేరుకొన్నా డు. ఆయన బాధ తగ్గినది.

రాఘవయ్యకు గాఢమైననిద్ర. ఏదో భయంకరంగానుండే కలగ న్నాడు. ప్రేలుతూ కలవరిస్తున్నా డు. కడుపులో ఓర్చుకోరాని వికా రంపుట్టింది. మేలుకొన్నాడు. గుం డెలమీద మనిషి కూర్చున్నట్లు బరువుగా తోచినది. లేచికూర్చు న్నాడు. మొదటిజాడ్యం మళ్ళీ ప్రారంభించింది. తనకు యెదుట యెవడో నిలిచియున్నట్లు తో చింది. దొంగయేమో ననుకొని 'ఎవరు? నిలిచియుండేది?' అన్నా డు రాఘవయ్య. 'ఎఱుగవానన్ను? నేను సుబ్బరామయ్యను. నాశాలు వా నాకు ఇచ్చివెయ్యి. లేకుంటే చంపుతాను. ఏమంటావు?' ఈమా టలు స్పష్టంగా విన్నాడు రాఘవ య్య. రూపంకూడాచూచాడు. యే మీతోచకుండా తత్తతిల్లుతూ, నిద్రపోతూవున్న తల్లినిలేపాడు. 'అమ్మో! నేను బ్రతుకలేను. చచ్చి పోతాను. ఎట్లోకాని శాలువ మళ్ళీ మనయిల్లు చేరినట్లున్నది- దీపం వెలిగించి, యెక్కడనయినా పెట్టి యున్నదేమోచూడు- వెంకటరమ ణయ్య దానిగుణం తెలిసికొని మ

నకు తెలియకుండా పెట్టి పోయినాడేమో' అనెను- అతనితల్లి దీపం తెచ్చి నలుమూలలు వెదకింది- కనపడలేదు- పైనచూడడంలో గోడపైనున్నట్లు తోచింది- బాగా చూచింది- ఔను! అదే! ఆశాలువే! అని తెలుసుకొన్నది- 'ఒరే! నాయనా! ఔనురో! అదిగో! గోడమీద కూర్చునిఉన్నది. పాడు శాలువు. ఇది నాశనంగాను, యెట్లువచ్చిందోగాని' అన్నది ఆమె. 'దానిని కఱ్ఱతో క్రిందదోసి వాకిట పారెయి' అన్నాడు రాఘవయ్య. 'అయ్యో! నేను దానిదగ్గఱకు కూడాపోను. అబ్బబ్బ! భయంవేస్తున్నది. నావల్లకాదు' అని యామె తడబడుతూ దూరంగా పోయి నిలిచింది. అంతట రాఘవయ్య ప్రాణానికి తెగించి ముక్కుతూ, మూలుగుతూ లేచి మెల్లగాపోయి కఱ్ఱతో దాన్ని క్రిందికిదీసి యెత్తుకొని యపుడే వెంకటరమణయ్య యింటి దగ్గరకరిగి, వెలిశగుండా లోపలికి వేసి వచ్చి పండుకున్నాడు.

అప్పుడు వెంకటరమణయ్యకు ముందటివలె లక్షణాలు కనపడ్డాయి, క్రిందుమీదైనాడు. 'ఓహో! ఇవి శాలువావల్ల గలిగిన గుణమే! సందేహంలేదు మళ్ళీవచ్చి చేరినట్లుంది యింట్లో! ఆరాఘవయ్యాముండాకొడుకు, తనయింట్లో నేను పెట్టివచ్చింది తెలుసుకొని దాన్ని తెచ్చి నాయింట్లో పడేసి పోయియుంటాడు' అని వెదికాడు. ఒకచోట శాలువా పడిఉన్నది దాన్ని చూడగానే గుండె టారుమన్నది. ఆలోచించాడు. సంకట పడుతూనే దాన్నెత్తుకొని గ్రామానికర మైలు దూరంలోఉండే వాగుకుపోయి, తొడలబంటి నీటిలో మట్టితోడి శాలువ నందులోనుంచి బిగదొక్కి, వెడలి గట్టెక్కి 'ఇంక శాలువాను నేను ముట్టడంలేదు. గంగాభవాని కర్పణంచేశాను. నన్ను మన్నించవలసింది' అని దండముపెట్టి చెంపలు కొట్టుకొన్నాడు.

'బ్రతికావుపో' అనేమాట అతనికపుడు వినపడ్డది- కాని రూపం యేదిన్ని కనపడలేదు-

వెంకటరమణయ్య యరుణోదయానికి యిల్లుచేరుకొన్నాడు- పిమ్మట యేమిన్నిలేదు- హోటలు యజమానుడైన వెంకట్రామయ్యకు, సుబ్బరామయ్యయిచ్చిన రూపాయలు సంపాదించుటకు శక్తిలేక, నానాబాధలు పడుతూ కృశించి కృశించి నాలుగైదేండ్లకు తరువాత తానున్నూ రూపాయలిచ్చి సుబ్బరామయ్య పోయినచోటికి పోయి చేరినాడు.

అచ్చట స్నేహితులుగానుండిన వారలిరువురును యెట్లు సమాధానము చేసికొన్నది మాత్రము యెవరికిని దెలియదు-

ఇందుచేత గలిగిన విశేషం యేమంటే, అక్కడ యెన్నాళ్ళనుండియో వాడుకగా ఉపాదానానికి వస్తూవుండిన సుబ్బన్న, ఒకవేళ శాలువాను తనకు తిరిగి అంటకట్టుదురేమోనని భయపడి ఆగ్రామానికి రావడమే చాలించాడు-

దయ్యములు, పిశాచాలు లేవని వాదంచేసే నామిత్రులు యీ వృత్తాంతమును చదివినంతట యేమి నిర్ధారణ చేయుదురో చూడవలె.

Printed at the Andhrabhumi Printing Works, 36 Mukatal Street. Vepery P.O, Madras.

Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.